DD9 వార్త
వాస్తవాలు పలుకు
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 147 | 09-10-2026 | శుక్రవారం | పేజీలు: 10 | వెల: 3/-

ఆర్టీసీ ఎన్నికలకు BRS దూరం ఎందుకు?

- ఆసక్తికరంగా తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు
- ఈసారి కూటమి కట్టిన పాత ప్రత్యర్థులు
- ఎన్నికలతో టచ్ మీ నాట్ అన్నట్టుగా బీఆర్ఎస్
- అధికారంలో ఉన్నప్పుడు ఆర్టీసీ కార్మిక సంఘాలను రద్దు చేసిన బీఆర్ఎస్



2



జీఎస్టీ సంస్కరణలపై భట్టి ఫైర్.. తెలంగాణకు భారీ నష్టం?

- జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలన్న భట్టి
- తెలంగాణకు ఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయ ప్రభావం
- నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ కార్యాలయాలకు ప్రతిపాదన

2



చలో లోక్‌భవన్..
ఉద్రిక్తత

- ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్, ఇండియా కూటమి ఆందోళన
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్
- 'సేవ్ డెమోక్రసీ' పేరుతో భారీ ర్యాలీ
- ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ
- లోక్‌భవన్ సమీపంలో నేతలను అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్లు దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత
- మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రుల అరెస్టు
- సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితి నేతలూ అదుపులోకి
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగిస్తామని వెల్లడి

హైదరాబాద్, (డీడీ9 వార్త):

నగరంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం తెలంగాణ కాంగ్రెస్, ఇండియా కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు 'చలో లోక్‌భవన్' కార్యక్రమం నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ మిగతా 2లో..

ఓటు హక్కును హరించే
కుట్ర

- మోదీ ఆదేశాలతోనే ఎస్ఐఆర్ ప్రక్రియ: రేవంత్
- దేశంలో ఓటు ఉన్నవారు.. లేనివారంటూ రెండు వర్గాలా?
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే
- రాహుల్, ప్రియాంక, ఖర్గే అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి
- 'సైమన్ గో బ్యాక్' తరహాలో 'జీకే గో బ్యాక్' ఉద్యమం
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం
- ప్రజా ఒత్తిడికి తలొగ్గక తప్పదు: సీఎం రేవంత్
- అవసరమైతే ప్రధాని రాజీనామా చేసే పరిస్థితి వస్తుంది



హైదరాబాద్, (డీడీ9 వార్త):

దేశ ప్రజల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఓటు హక్కు ఉన్న వారు, లేనివారు మిగతా 2లో..



మళ్లీ మళ్లీ ప్రధానిగా మోదీనే కావాలి

- బీజేపీ ఎంపీ డీకే అరుణ
- మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు గుర్తుగా పాలమూరులో సేవా జ్యోతి యాత్ర
- 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా కాగడాలతో భారీ ర్యాలీ
- ప్రపంచ దేశాల్లో భారత్ కీర్తి ప్రతిష్ఠలు పెంచిన ఘనత మోదీకే
- వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనకు ప్రజలు అండగా నిలవాలి
- మోదీని అభాసుపాలు చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది
- దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు
- అంబేడ్కర్ కళాభవన్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ
- బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సందడి

హైదరాబాద్, (డీడీ9 వార్త):

ప్రధానిగా నరేంద్ర మోదీ మళ్లీ మళ్లీ కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజాసేవలో నరేంద్ర మోదీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా పాలమూరు జిల్లా కేంద్రంలో 'సేవా జ్యోతి యాత్ర' నిర్వహించారు. అంబేడ్కర్ కళాభవన్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాగడాలతో మిగతా 2లో..

సీఈసీ నియామకంపై సుప్రీంకోర్టులో పిటిషన్

- జ్ఞానేశ్‌కుమార్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకానికి సవాల్
- 2023 నియామక చట్టంలోని నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ పిటిషన్
- సెర్చ్, సెలెక్షన్ కమిటీ ప్రక్రియపైనా అభ్యంతరాలు
- జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలపై ప్రశ్నలు
- క్వో వారంటో జారీ చేయాలని సుప్రీంకోర్టును కోరిన పిటిషనర్
- నియామక ప్రక్రియకు సంబంధించిన అసలు రికార్డులు సమర్పించాలని విజ్ఞప్తి
- ఎన్నికల సంఘం పనితీరుపై దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు



హైదరాబాద్, (డీడీ9 వార్త):

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలంటూ దేశవ్యాప్తంగా డిమాండ్లు వెల్లువెత్తుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. జ్ఞానేశ్‌కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో మిగతా 2లో..

ఫేక్ ఫొటోతో సీపీ సజ్జనార్ పేరుతో ప్రచారం

- 'దేవర' పాటను మార్ఫింగ్ చేసిన వారిని అరెస్ట్ చేశారంటూ వైరల్
- వైరల్ ఫొటోపై సీపీ సజ్జనార్ క్లారిటీ
- అది ఏఐతో రూపొందించిన డీప్‌ఫేక్: సజ్జనార్
- నిజానిజాలు తెలుసుకోకుండా షేర్ చేయొద్దని సూచన
- నమ్మశక్యంగా కనిపించినంత మాత్రాన నిజం కాదని హెచ్చరిక
- ఏఐ చిత్రాలు మరింత వాస్తవికంగా మారుతున్నాయని వెల్లడి



హైదరాబాద్, (డీడీ9 వార్త):

'దేవర' సినిమాలోని 'చుట్టమల్లే..' పాటను ఏఐ సాయంతో అసభ్యకరంగా మార్ఫింగ్ చేసిన నిందితులను సీపీ సజ్జనార్ అరెస్ట్ చేశారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోపై ఆయన స్పందించారు. ఆ ఫొటో పూర్తిగా ఫేక్ అని, ఏఐ సాయంతో మిగతా 2లో..

జూరాల నీటి కోసం ఆందోళన.. రైతులపై కేసులు

- కాలువకు నీళ్లు వదిలిన 14 మంది రైతులపై కేసు నమోదు
- ఇరిగేషన్ డీఈ ఫిర్యాదుతో పోలీసుల చర్యలు
- సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన
- అధికారులు స్పందించకపోవడంతో గేట్లు ఎత్తిన రైతులు
- సెప్టెంబర్ 19న జూరాల కాలువకు నీటి విడుదల
- 19, 20 తేదీల్లో జరిగిన ఆందోళనలపై కేసుల నమోదు
- జమ్మిచేడు వద్ద ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నేతలపైనా కేసులు
- జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్
- రైతుల ఆందోళనలపై పోలీసుల చర్యలు

హైదరాబాద్, (డీడీ9 వార్త):

వనపర్తి జిల్లా పరిధిలోని జూరాల కాలువకు నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జూరాల ప్రాజెక్టు ఇరిగేషన్ డీఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి వెల్లడించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు, నాయకులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఈ కేసులు నమోదయ్యాయి.

జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని రైతులు, నాయకులు ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించకపోవడంతో సెప్టెంబర్ 19న సాయంత్రం రైతులే బలవంతంగా గేట్లు ఎత్తి జూరాల కాలువకు నీటిని విడుదల చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సెప్టెంబర్ 19, 20 తేదీల్లో చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఇరిగేషన్ డీఈ ఫిర్యాదు మేరకు కాలువకు నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై కేసులు నమోదయ్యాయి. కేసుల నమోదును అమరచింత ఎస్సై స్వాతి ధ్రువీకరించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళనకు దిగినట్లు తెలిపారు.

మరోవైపు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21న జమ్మిచేడు వద్ద ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో జూరాల నీటి విడుదల కోసం జరిగిన ఆందోళనలకు సంబంధించి రైతులు, రాజకీయ పార్టీల మిగతా 2లో..

- మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- రైతుల చేతులకు బేడీలు వేయడం పరిపాటిగా మారిందని ఆరోపణ
- ఇంజినీర్లతో రైతులపై కేసులు పెట్టించడం దారుణమని వ్యాఖ్య
- కృష్ణాలో నీళ్లు ఉన్నా లిఫ్ట్ చేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శ
- నీటిని వినియోగించుకోకుండా తెలంగాణకు జలద్రోహం చేశారని ఆరోపణ

రైతులపై కేసులు పెడతారా?

- జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడంపై మండిపాటు
- పంటలు ఎండిపోతుంటే నీళ్లు అడిగితే కేసులు పెడతారా?

హైదరాబాద్, (డీడీ9 వార్త):

జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుబట్టారు. పంటలు కళ్ల ముందే ఎండిపోతున్న పరిస్థితుల్లో నీటిని విడుదల చేయాలని రైతులు ఆందోళనకు దిగితే వారిపై కేసులు నమోదు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం తన ఎక్స్ ఖాతా ద్వారా స్పందించిన హరీశ్‌రావు.. రైతులపై మిగతా 2లో..

ఫేక్ ఫొటోతో సీపీ సజ్జనార్ పేరుతో ప్రచారం

మొదటిపేజీ తరువాయి

రూపొందించిన డీప్‌ఫేక్ అని స్పష్టం చేశారు. తన ఫొటోను కొందరు ఎన్టీఆర్ అభిమానులు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంటూ సినీనటుడు ఎన్టీఆర్‌కు చెందిన సోషల్ మీడియా ఖాతాను ట్యాగ్ చేశారు. వైరల్ అవుతున్న ఫొటోకు, వాస్తవ ఘటనకు సంబంధం లేదని సీపీ సజ్జనార్ తెలిపారు. ఏఐ సాయంతో రూపొందించిన చిత్రాలను నిజమైనవిగా భావించి నెటిజన్లు మోసపోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ఏదైనా ఫొటో నమ్మశక్యంగా కనిపించినంత మాత్రాన అది నిజమైనదని భావించకూడదని స్పష్టం చేశారు.

ఏఐ సాంకేతికతతో రూపొందిస్తున్న చిత్రాలు రోజురోజుకూ మరింత వాస్తవికంగా కనిపిస్తున్నాయని సజ్జనార్ పేర్కొన్నారు. దీంతో సోషల్ మీడియాలో కనిపించే ఫొటోలు, వీడియోల వెనుక ఉన్న వాస్తవాలను తెలుసుకోవడం మరింత ముఖ్యమైందన్నారు. ఏదైనా కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు.

నిజానిజాలు తెలుసుకోకుండా కంటెంట్‌ను షేర్ చేస్తే తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతుందని సీపీ హెచ్చరించారు. ముఖ్యంగా డీప్‌ఫేక్ కంటెంట్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తప్పుడు ఫొటోలు, వీడియోల ద్వారా వ్యక్తుల ప్రతిష్ఠకు నష్టం కలిగే అవకాశం ఉన్నందున సోషల్ మీడియాలో కంటెంట్‌ను షేర్ చేసే ముందు జాగ్రత్త వహించాలని సూచించారు.ఈ నేపథ్యంలో తన ఫొటోతో రూపొందించిన వైరల్ చిత్రాన్ని సజ్జనార్ స్వయంగా ఫేక్‌గా తేల్చి చెప్పడంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై స్పష్టత వచ్చింది.

సీఈసీ నియామకంపై సుప్రీంకోర్టులో పిటిషన్

మొదటిపేజీ తరువాయి

పిటిషన్ దాఖలైంది. 2023లో తీసుకొచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం ప్రకారం నియామక ప్రక్రియ జరగలేదని పిటిషనర్ ఆరోపించారు.

2024 మార్చి 14న జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూలను ఎన్నికల కమిషనర్లుగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులతో పాటు.. 2025 ఫిబ్రవరి 17న జ్ఞానేశ్‌కుమార్‌ను సీఈసీగా, వివేక్ జోషిని ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను పిటిషన్‌లో సవాల్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద దాఖలైన ఈ పిటిషన్‌లో నియామకాల చట్టబద్ధతపై న్యాయస్థానం పరిశీలన కోరారు.

2023లో రూపొందించిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల నియామకం, సేవా నిబంధనలు, పదవీకాల చట్టం'లోని సెక్షన్లు 5, 6, 8(1) ప్రకారం నియామక ప్రక్రియ జరగలేదని పిటిషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా సెర్చ్ కమిటీ, సెలెక్షన్ కమిటీ వ్యవహరించిన తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న రెండు ఎన్నికల కమిషనర్ పదవులకు అవసరమైన సంఖ్యలో అభ్యర్థుల పేర్లను సెర్చ్ కమిటీ సిఫారసు చేయలేదని ఆరోపించారు.

ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి కేంద్ర ప్రభుత్వానికి చెందిన సభ్యుడిని చేర్చిన 2023 చట్టంపైనా పిటిషన్‌లో అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వార్తలు వెలువడ్డాయి. నియామక ప్రక్రియకు సంబంధించిన సెర్చ్, సెలెక్షన్ కమిటీ అసలు రికార్డులను కోర్టు ముందుంచాలని పిటిషనర్ కోరారు. ఇదిలా ఉండగా.. ఎన్నికల ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కూడా దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని ప్రతిపక్ష పార్టీలు, పలు పౌర, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎన్నికల సంఘం, బీజేపీ మాత్రం ఓటర్ల జాబితా సవరణపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నాయి.

కర్ణాటకలోని బెంగళూరులో కూడా సీఈసీ రాజీనామా, ఎస్ఐఆర్ ప్రక్రియ రద్దు డిమాండ్లతో నిరసన జరిగింది. 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన ఆందోళనలో నటుడు ప్రకాశ్‌రాజ్ పాల్గొన్నారు. సీఈసీ ఒక్కరి రాజీనామాతో సమస్య పరిష్కారం కాదని, ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియపైనే తమ అభ్యంతరమని నిరసనకారులు పేర్కొన్నారు.

ఇక ఎన్నికల సంఘం పనితీరు, ఎస్ఐఆర్ నిర్ణయాలపై దాఖలైన ఇతర పిటిషన్లపైనా సుప్రీంకోర్టు విచారణ కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ముగ్గురు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాల్ చేస్తూ మరో పిటిషన్ దాఖలు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా పిటిషన్‌లోని ఆరోపణలు ప్రస్తుతం పిటిషనర్ వాదనలు మాత్రమేనని, వాటిపై సుప్రీంకోర్టు తుది నిర్ణయం వెలువరించాల్సి ఉంది.

రైతులపై కేసులు పెడతారా?

మొదటిపేజీ తరువాయి

కేసులు పెట్టడాన్ని తీవ్రంగా విమర్శించారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు సాగునీటి కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. పంటలకు నీరు విడుదల చేయాలని కోరిన రైతులపై కేసులు నమోదు చేయడం సరికాదని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతులపై పోలీసు కేసులు నమోదు చేయడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారిందని ఆరోపించారు.

రైతులపై ఇంజినీర్లతో కేసులు పెట్టించడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల కారణంగా పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని ఆరోపించారు. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. తమ హక్కుల కోసం రోడ్డెక్కిన రైతులపై పోలీసు కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు.

కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు ఉన్న సమయంలో వాటిని వినియోగించుకోకుండా నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోకుండా వదిలేయడం ద్వారా తెలంగాణకు జలద్రోహం చేశారని విమర్శించారు. ప్రభుత్వం చేసిన తప్పులకు రైతులు శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. సాగునీరు, విద్యుత్ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు. ఇది ప్రజా పాలనా? లేక ప్రజా పీడనా? అని ప్రశ్నించారు.

జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని హరీశ్‌రావు బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. రైతులపై కేసులు పెట్టే విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. రైతు వ్యతిరేక చర్యలు ఇలాగే కొనసాగితే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు.

జీఎస్టీ సంస్కరణలపై భట్టి ఫైర్.. తెలంగాణకు భారీ నష్టం?

- **జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలన్న భట్టి**
- **తెలంగాణకు ఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయ ప్రభావం**
- **నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ కార్యాలయాలకు ప్రతిపాదన**

హైదరాబాద్, (డీడీ9 వార్త):

జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి అనుసరణ ప్రక్రియను సరళీకరించడంతో పాటు, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగాలని స్పష్టం చేశారు.జీఎస్టీ అమలుకు పునాది పరస్పర విశ్వాసమేనని భట్టి పేర్కొన్నారు. ఉమ్మడి జాతీయ మార్కెట్ ఏర్పాటుతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్న నమ్మకంతో రాష్ట్రాలు తమ స్వతంత్ర పన్ను విధించే అధికారంలో గణనీయమైన భాగాన్ని వదులుకున్నాయని గుర్తుచేశారు. కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేయడం, రాష్ట్రాల ఆదాయాన్ని కాపాడటం, కీలక మార్పులను సంప్రదింపులు, ఏకాభిప్రాయంతో చేపట్టడం ఈ వ్యవస్థకు మూల సూత్రాలని అన్నారు.

తెలంగాణపై జీఎస్టీ ప్రభావం

తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని భట్టి తెలిపారు. ఈ ఆదాయంతోనే రాష్ట్రంలో పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలకు నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. జీఎస్టీ ఆదాయంలో తగ్గుదల కేవలం లెక్కల అంశం కాదని, ప్రజలకు సేవలు అందించే రాష్ట్ర సామర్థ్యంపై నేరుగా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

మోటార్ వాహనాలు, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌పుట్ సర్వీసుల రీఫండ్‌లకు సంబంధించిన మార్పులు చేపట్టే ముందు వాటి పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాష్ట్రాలకు వివరించాలని కోరారు. మోటార్ వాహనాల విషయంలో కేంద్రం అందించిన అంచనాల ప్రకారం తెలంగాణకు ఏడాదికి సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని, రాష్ట్ర సొంత అంచనాల ప్రకారం ఈ నష్టం అంతకంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. తగిన సందర్భాల్లో ఆటోమేటిక్ జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ మార్పులు, రద్దు దరఖాస్తుల ఆటోమేటిక్ ప్రాసెసింగ్‌కు భట్టి మద్దతు తెలిపారు. రిస్క్ లేని కేసుల్లో ఆటోమేటిక్‌గా రీఫండ్‌లు మంజూరు చేయడం ద్వారా నిజాయితీగల పన్నుదారులకు త్వరగా ప్రయోజనం అందుతుందని అన్నారు. అదే సమయంలో అధిక రిస్క్ ఉన్న కేసులపై పన్ను అధికారులు మరింత దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. పెనాల్టీలను హేతుబద్ధీకరించడం, రహదారులపై సరుకుల వాహనాలను యాదృచ్ఛికంగా నిలిపివేయడాన్ని తగ్గించడం వంటి చర్యలను స్వాగతించారు. జీఎస్టీ రిటర్నుల్లో అవసరమైన మార్పులు చేసి పన్ను వివరాల్లో తేడాలను తగ్గించాలని, నిజాయితీగల పన్నుదారులకు అనవసర నోటీసులు జారీ కాకుండా చూడాలని సూచించారు. జీఎస్టీ అమలులో స్పష్టత, ఏకరూపత కోసం తగిన సర్క్యులర్లు, వివరణలు జారీ చేయాలని కోరారు.

నకిలీ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం

పన్నుదారులకు అనుకూలమైన విధానాలను అమలు చేయడంతో పాటు జీఎస్టీ మోసాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, గుర్తింపు వివరాల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని భట్టి డిమాండ్ చేశారు. వృద్ధులు, గృహిణులు, రోజువారీ కూలీలు, ఇతర అమాయకుల ఆధార్, పాన్ వివరాలను దుర్వినియోగం చేసి మోసపూరిత జీఎస్టీ రిజిస్ట్రేషన్లు సృష్టిస్తున్న ఘటనలను ప్రస్తావించారు.

నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడం లేదా ఇతరులకు బదిలీ చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులు, వ్యవస్థీకృత ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విధానాలను సరళీకరించడం పేరుతో వ్యవస్థీకృత పన్ను ఎగవేతపై అమలు చర్యలు బలహీనపడకూడదని స్పష్టం చేశారు.

స్క్రాప్ రంగంపై ప్రత్యేక దృష్టి

శేవ్యాప్తంగా స్క్రాప్ రంగంలో జరుగుతున్న పన్ను ఎగవేతను భట్టి ప్రస్తావించారు. అసంఘటిత, నగదు ఆధారిత వ్యవస్థ కారణంగా నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ బదిలీ చేయడం జరుగుతోందని చెప్పారు. అదే సమయంలో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న చెత్త సేకరించే కార్మికులు, చిన్న స్థాయి సేకరణదారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి, పేద ప్రజల ప్రయోజనాలను కాపాడే కార్యాచరణను రూపొందించేందుకు జీఎస్టీ కౌన్సిల్ మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రతిపాదించింది.

దేశంలో అత్యంత చురుకైన పన్ను ఆధారాల్లో తెలంగాణ ఒకటని భట్టి అన్నారు. అయితే చాలా కాలంగా అధికారుల కమిటీల్లో తెలంగాణకు తగిన ప్రాతినిధ్యం లభించలేదని పేర్కొన్నారు. జీఎస్టీ కౌన్సిల్ పునర్వ్యవస్థీకరించే కమిటీల్లో తెలంగాణకు సభ్యత్వం కల్పించాలని కోరారు. స్టాండింగ్ కమిటీ ఆఫ్ ఆఫీసర్స్‌లోనూ తెలంగాణకు ప్రాతినిధ్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో జీఎస్టీ ప్రాంతీయ కార్యాలయాలు

హైదరాబాద్ కేవలం భౌగోళికంగా అనుకూలమైన నగరం మాత్రమే కాదని, టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశంలోని ప్రముఖ కేంద్రాల్లో ఒకటని భట్టి పేర్కొన్నారు. భవిష్యత్ జీఎస్టీ పరిపాలనకు అవసరమైన సాంకేతిక సామర్థ్యాలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు.

ఈ నేపథ్యంలో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల జీఎస్టీ పరిపాలన రాష్ట్రాలకు మరింత చేరువ కావడంతో పాటు, సాంకేతికత ఆధారిత పన్ను మోసాల గుర్తింపు వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారు

సరుకుల వాహనాల తనిఖీల విషయంలో ప్రస్తుతం ఉన్న అధికారాలను మూల రాష్ట్రం, గమ్య రాష్ట్రం రెండింటికీ కొనసాగించాలని తెలంగాణ సూచించింది. పన్ను ఎగవేతను అరికట్టడంతో పాటు, వ్యాపార కార్యకలాపాలకు అనవసరమైన ఇబ్బందులు కలగకుండా సమతుల్య విధానం అవసరమని భట్టి పేర్కొన్నారు.

తెలంగాణ వంటి ఎగుమతి రాష్ట్రాల సహకారాన్ని గుర్తించాలని భట్టి కోరారు. పోటీతో కూడిన ఎగుమతి వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలు, ప్రజా ప్రయోజనాల కోసం పెట్టుబడులు పెట్టే రాష్ట్రాలకు తగిన మద్దతు, ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. ప్రజారోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు హెల్త్ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్సులలో రాష్ట్రాలకు నిర్దిష్టమైన, పారదర్శక వాటా కల్పించాలని కోరారు. జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం అంతిమంగా కేంద్రానిదీ, రాష్ట్రాలదీ కాదని.. అది భారత ప్రజలకు చెందినదని భట్టి పేర్కొన్నారు. ప్రజలపై ఉన్న బాధ్యతను గుర్తుంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. "నిజాయితీగల పన్నుదారులకు అనుసరణ ప్రక్రియను సులభతరం చేయడం.. ఉద్దేశపూర్వక పన్ను మోసాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగించడం.. ఈ రెండూ సమాంతరంగా సాగాలి" అని భట్టి స్పష్టం చేశారు. ప్రజలు కేంద్రం, రాష్ట్రాలపై ఉంచిన విశ్వాసానికి తగిన విధంగా జీఎస్టీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

జూరాల నీటి కోసం ఆందోళన.. రైతులపై కేసులు

మొదటిపేజీ తరువాయి



నాయకులపై కేసులు నమోదైనట్లయింది. జూరాల కాలువకు నీటిని విడుదల చేసిన రైతులపై కేసులు నమోదు కావడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పటికే స్పందించారు. పంటలు ఎండిపోతున్న పరిస్థితుల్లో సాగునీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు చేయడం సరికాదని ఆయన విమర్శించారు. రైతులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

చలో లోక్‌భవన్.. ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీగా బయలుదేరిన నేతలను పోలీసులు లోక్‌భవన్ సమీపంలో అడ్డుకున్నారు.

ర్యాలీని నిలువరించేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే బారికేడ్లు దాటి ముందుకు వెళ్లేందుకు కాంగ్రెస్, కూటమి నేతలు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితికి చెందిన నాయకులను కూడా అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై విమర్శలు చేశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ ఆయన పదవిలో కొనసాగడం సరికాదని అన్నారు. జ్ఞానేశ్‌కుమార్ స్వచ్ఛందంగా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఓటర్ల జాబితా సవరణ అంశంపై ప్రజల్లో పలు అనుమానాలు ఉన్నాయని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఆ అనుమానాలను నివృత్తి చేసే పరిస్థితుల్లో కేంద్ర ఎన్నికల సంఘం లేదని ఆయన ఆరోపించారు. ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

మరోవైపు దిల్లీలో రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీతో పాటు ఇండియా కూటమి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనను తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఖండించారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ఆందోళనలను అడ్డుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అంశాలపై తమ ఆందోళనలు కొనసాగుతాయని కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు స్పష్టం చేశారు.

ఓటు హక్కును హరించే కుట్ర

మొదటిపేజీ తరువాయి

అంటూ రెండు వర్గాలను సృష్టించే ప్రయత్నం జరుగుతోందని వాపోయారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే.. ఆయనపై చర్యలు తీసుకోవడం దారుణమని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను అరెస్టు చేసిందని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని అన్నారు.

'సైమన్ గో బ్యాక్' తరహాలో 'జీకే గో బ్యాక్'

గతంలో 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు దేశంలో 'సర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. గతంలో రైతుల ఉద్యమం సందర్భంగా మోదీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించినా... చివరకు ప్రజల ఒత్తిడికి తలొగ్గి చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు కూడా ఎంత మొండిగా వ్యవహరించినా జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పేర్కొన్నారు. అవసరమైతే ఈ వ్యవహారం మరింత ముందుకు వెళ్లి ప్రధాని రాజీనామా చేయాల్సిన పరిస్థితి కూడా వస్తుందని అన్నారు.

దేశ ప్రజల ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరు

భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో రాజకీయ ప్రత్యర్థుల ను ఎదుర్కొనేందుకు ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను ఉపయోగించుకున్నారని, ఇప్పుడు నేరుగా ఎన్నికల సంఘాన్నే రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఓట్లను తొలగించి తమకు అనుకూలంగా ఎన్నికల ఫలితాలను మార్చే ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని చెప్పారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసులు వ్యవహరించిన తీరును చూస్తే మోదీ, అమిత్‌షాల అసహనం స్పష్టంగా కనిపిస్తోందని సీఎం అన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, పదవులను కాపాడుకునేందుకు ప్రతిపక్ష నేతలపై పోలీసులను ప్రయోగిస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ ఉద్యమం కాదు ఇది...

ప్రజల ఉద్యమం

దేశంలోని ప్రజలు జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజల హక్కులను కాలరాసిన వారికి చరిత్రలో ఎవరూ తప్పించుకోలేదని, చివరకు ప్రజల కోర్టులోనే తీర్పు ఎదుర్కోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల డిమాండ్‌ను అంగీకరించి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగుతుందని సీఎం స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే పరిమితమైన ఉద్యమం కాదని, ఇండియా కూటమి, ప్రజల ఉద్యమమని అన్నారు. ప్రజలు ఒక్కటై గొంతెత్తితే ప్రభుత్వం తప్పనిసరిగా వినాల్సిందేనని, లేకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగుతారని, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఎం తెలిపారు.

ఆర్టీసీ ఎన్నికలకు BRS దూరం ఎందుకు?

- **ఆసక్తికరంగా తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు**
- **ఈసారి కూటమి కట్టిన పాత ప్రత్యర్థులు**
- **ఎన్నికలతో టచ్ మీ నాట్ అన్నట్టుగా బీఆర్ఎస్**
- **అధికారంలో ఉన్నప్పుడు ఆర్టీసీ కార్మిక సంఘాలను రద్దు చేసిన బీఆర్ఎస్**

హైదరాబాద్, (డీడీ9 వార్త):

తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు బీఆర్ఎస్ ఎందుకు దూరంగా ఉంది? అనుబంధ కార్మిక సంఘ నేతల నుంచి వత్తిడి వచ్చినా... పార్టీ పెద్దలు ఎందుకు కామ్‌గా ఉండమన్నారు? కనీసం పోటీలో ఉన్న ఏ యూనియన్‌కు బహిరంగ మద్దతు ప్రకటించకపోవడానికి కారణాలేంటి? బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం నేతలు లోపాయికారీగా ఏం చేస్తున్నారు? తమ స్టాండర్డ్ ఓటర్స్‌కు ఏం చెబుతున్నారు?.సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతున్నాయి. జనరల్ ఎలక్షన్స్‌ని తలపించేలా నడుస్తున్న ఈ ప్రక్రియలో వివిధ రాజకీయ పార్టీలు ఆయా సంఘాలకు మద్దతిస్తున్నాయి. ఆయితే... గతంలో శత్రువులుగా ఉన్న వాళ్ళు ఇప్పుడు మిత్రులు అవడంతో ఈ సారి ఎలక్షన్స్ రక్తి కడుతున్నాయి.

గతంలో ప్రత్యర్థులుగా పోటీ పడిన EU, TMU, NMU ఈసారి కూటమిగా ఏర్పడ్డాయి. అప్పుడు EU, TMUలో కీలక పాత్ర పోషించిన నేతలే తెలంగాణ వర్కర్స్ యూనియన్ SWFగా బరిలోకి దిగుతున్నారు. ఈ swf కు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు సిఐటీయు అనుబంధ సంఘం మద్దతు తెలపడంతో ఆర్టీసీ ఎన్నికలు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదే సమయంలో బీఆర్ఎస్ వైఖరిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఏ ఎన్నికలు వచ్చినా హడావుడి చేసే ఆ పార్టీ కీలకమైన ఆర్టీసీ ఎన్నికలతో అంటీ ముట్టనట్టుగా ఎందుకు ఉంటోందంటూ మాట్లాడుకుంటున్నారు నేతలు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీ చేసింది. మాజీ మంత్రి హరీష్ రావు గౌరవాధ్యక్షుడిగా గుర్తింపు సంఘం ఎన్నికలను సీరియస్ గా తీసుకొని పనిచేసేవారు. అయితే ఈ సారి మాత్రం ఎన్నికలకు దూరంగా ఉండడానికి బలమైన కారణమే ఉందని అంటున్నారు పార్టీ నాయకులు

ఓట్ల తొలగింపును నిలిపివేయాలి

- **సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి: నరేష్ రత్న**

పెద్దపల్లి బ్యూరో, (డీడీ9 వార్త):



అర్హులైన ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నరేష్ రత్న డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని కోరారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసి గతంలో అమలులో ఉన్న విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను తీసుకొచ్చారని ఆరోపించారు. 2025 ఫిబ్రవరిలో వార్షిక ఓటర్ల జాబితా ప్రకటించిన ఆరు నెలల్లోనే మరో సవరణ చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చకుండా కోట్లాది మందిని ఓటు హక్కుకు దూరం చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. అక్రమంగా తొలగించిన ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో పౌరుల భాగస్వామ్యానికి కీలకమని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని నరేష్ రత్న తెలిపారు.

శ్రమించే చేతులకు గౌరవమే నిజమైన సేవ!

- **పారిశుధ్య కార్మికులకు బీజేపీ ఘన సత్కారం**
- **కాళ్లు కడిగి గౌరవం.. సహపంక్తి భోజనం**

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 08 (డీడీ9 వార్త):

సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా జనగామ మండలంలో పారిశుధ్య కార్మికులను బీజేపీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. బీజేపీ లేబర్ సెల్ జిల్లా కన్వీనర్ తడగొండ నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్మికుల కాళ్లు కడిగి గౌరవించిన అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు.



ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం ఎండ, వాన, చలి లెక్కచేయకుండా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. శ్రమించే చేతులను గౌరవించడమే నిజమైన సేవ అని పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండబోయిన భూమయ్య, ఊరగొండ అపర్ణ, మచ్చ విశ్వాస్, సులువ పద్మ, ఎల్తూరి సరిత, ఎల్తూరి రాజయ్య, కోడూరి రమేష్, దెబ్బట కమలాకర్, నడిగోట్టు రాజేందర్, అంకరి భరత్ తదితరులు పాల్గొన్నారు.





సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు రూ.25 వేల లాభాల వాటా

- **కనీస వేతనాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం.. సేఫ్టీ మెటీరియల్ అందించాలి: ఎం.ఎ. గౌస్**

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 08 (డీడీ9 వార్త):

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటాగా రూ.25 వేల చొప్పున చెల్లించాలని ఏఐటీయూసీ ఆర్జీ1 అధ్యక్షుడు ఎం.ఎ. గౌస్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ1 ఏరియాలోని జీడీకే1 సీఎచ్‌పీలో నిర్వహించిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తూ బొగ్గు ఉత్పత్తికి సహకరిస్తున్నారని తెలిపారు. 2024లో రూ.5 వేలు, 2025లో రూ.5,500 చొప్పున లాభాల వాటా ఇప్పించినట్లు పేర్కొన్నారు. 2025-26లో వచ్చే లాభాల నుంచి రూ.25 వేల చొప్పున చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని గౌస్ ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో సేఫ్టీ మెటీరియల్ అందక కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని, వెంటనే భద్రతా పరికరాలు అందించాలని కోరారు. సమావేశంలో కార్మికులు వెంకన్న, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించండి

- **కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్యంగా నిలవాలి: చాడ వెంకటరెడ్డి**

పెద్దపల్లి బ్యూరో, (డీడీ9 వార్త):

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, టీఎంయూ, ఎన్ఎంయూ కూటమికి కార్మికులు మద్దతు ఇవ్వాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, ఆర్టీసీ పరిరక్షణ, ప్రభుత్వంలో విలీనం వంటి అంశాలపై ఎంప్లాయిస్ యూనియన్ కూటమి పోరాడుతోందని ఆయన పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలని సూచించారు.

ఆర్టీసీ ఎన్నికల్లో రాజకీయ జోక్యాన్ని కార్మికులు తిప్పికొట్టాలని చాడ వెంకటరెడ్డి అన్నారు. గతంలో కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు నిర్వహించిందని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసి గోదావరిఖని డిపోలో అత్యధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలని కార్మికులను కోరారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్, కలవేన శంకర్, తాండ్ర సదానందం, కే.కనకరాజు, మార్కాపురి సూర్య, గౌతమ్ గోవర్ధన్, మడ్డి ఎల్లయ్య, రేణికుంట్ల ప్రీతం, తాళ్లపల్లి లక్ష్మణ్, కోడం స్వామి తదితరులు పాల్గొన్నారు.





రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టుకు నిరసనగా మణుగూరులో కాంగ్రెస్ ఆందోళన.



- **ధర్నా, రాస్తారోకోలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

మణుగూరు, అక్టోబర్ 8 (డి డి 9వార్త)



ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఓటర్ల జాబితా సవరణ అంశంపై నిరసన వ్యక్తం చేస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తదితర ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనకు నిరసనగా మణుగూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నాడు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నా, రాస్తారోకో కార్యక్రమాల్లో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని కాంగ్రెస్ శ్రేణులకు సంఘీభావం తెలిపారు. అనంతరం పట్టణంలో నిర్వహించిన నిరసన ర్యాలీలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని అన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందన్నారు.ఢిల్లీలో ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రజల ఓటు హక్కు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, INTUC నాయకులు, లారీ యూనియన్ ప్రతినిధులు, బొగ్గు ముఠా కార్మికులు, గుమాస్తాల సంఘం నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు బతుకమ్మ వేడుకలు ప్రతీక..

- **మణుగూరు డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు..**
- **విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

మణుగూరు. అక్టోబర్ 8 (డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విద్యార్థులతో కలిసి బతుకమ్మ పాటలకు ఉత్సాహంగా పాల్గొని, వారితో కలిసి బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో సందడి చేశారు.ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన మన సంస్కృతికి బతుకమ్మ ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మహిళా సాధికారతతో పాటు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వై. చిన్నప్పయ్య, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఆర్. వీణ, సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, జిల్లా నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, ముఖ్య నాయకులు ఎస్. గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సింగరేణి కార్మికుల సమస్యలపై హైదరాబాద్‌లో కీలక సమావేశం

పాల్గొన్న ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.

- **ఈ నెల 14న రామగుండంలో కె టి ఆర్ సింగరేణి కార్మిక గర్జన.**

మణుగూరు. అక్టోబర్ 8 (డి డి 9వార్త)

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సర్కార్ కార్మిక సంఘాల వైఫల్యాలపై చర్చించేందుకు గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బి ఆర్ యస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు హాజరు అయ్యారు.

భద్రాద్రి కొత్తగూడెం బి ఆర్ యస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు తో పాటు కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధులు టి.బి.జి.కె.యస్ రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి హాజరయ్యారు.

మణుగూరు ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఏరియా టి.బి.జి.కె.యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ సమావేశంలో ప్రస్తావించారు.

మణుగూరు ఏరియాలో కార్మికులకు సంబంధించిన సంక్షేమం, వైద్య సదుపాయాలు, కార్మిక హక్కులు, సంస్థలో నెలకొన్న సమస్యలు, కార్మిక సంఘాల పాత్ర తదితర అంశాలపై నాయకత్వం దృష్టికి తీసుక వెళ్లినట్టు నాగెల్లి తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఈ నెల 14న రామగుండంలో సింగరేణి కార్మిక గర్జన

సింగరేణి కార్మికుల సమస్యలను రాష్ట్రవ్యాప్తంగా కార్మిక,ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 14వ తేదీన రామగుండం ఏరియాలో వేలాది మంది కార్మికులతో "సింగరేణి కార్మిక గర్జన" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమావేశంలో వెల్లడించినట్టు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టి.బి.జి.కె.యస్ నాయకులు పిలుపునిచ్చారు.

"సింగరేణి పరిరక్షణ - కార్మికుల హక్కుల సాధన" లక్ష్యంగా రామగుండం కార్మిక గర్జనను విజయవంతం చేయాలని నాగెల్లి కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, కొత్తగూడెం, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్లు తుమ్మ శ్రీనివాస రావు, గడప రాజయ్య, జి కె సంపత్ మరియు టి బి జి కె యస్ రాష్ట్ర నాయకులు,అన్ని ఏరియాల సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ లు, వైస్ ప్రెసిడెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులకు అధికారులకు ఆహ్వానం అందజేత

భద్రాచలం టౌన్, అక్టోబరు 8 (డీడీ9 వార్త)

భద్రాచలంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 20 వరకు నిర్వహించే శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ గురువారం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఎస్పీ అరుణ్‌కుమార్లకు ఆలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులను ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే భద్రాచలం తహసీల్దారు టి.రవి, సీఐ సట్లరాజు, ఎస్సైలు రామకృష్ణ, తిరుపతిలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాగాపు రాజు, ఆలయ ఈవో ఎస్ శేషయ్య, ప్రధాన అర్చకులు విశ్వనాధ శర్మ పాల్గొన్నారు.



పశువులతో వెళ్తున్న మినీ వ్యాన్ను అడ్డుకున్న సేవా వాహిని ఆలయ అర్చకులు

భద్రాచలం టౌన్, అక్టోబరు 8 (డీడీ9 వార్త)

పట్టణంలో పట్ట పగలే మినీ వ్యాన్లో లో సుమారు తొమ్మిది పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన లక్ష్మీనరసింహ నృసింహ సేవా వాహిని సభ్యులు అడ్డుకున్నారు. గురువారం స్థానిక బ్రిడ్జి రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఈ వాహనాన్ని గమనించిన ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మినీ వ్యాన్ను అదుపులోకి తీసుకొని అందులో ఉన్న పశువులను పోలీసు స్టేషన్కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.



అర్ధరాత్రి గోదావరిలో ఆర్తనాదం!

- **అప్రమత్తమైన పోలీసులు.. యువకుడి ప్రాణాలు కాపాడిన సీఐ సట్ల రాజు**
- **ఇసుక దిబ్బ వద్ద చిక్కుకున్న జంపన్నను గజ ఈతగాడి సాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన వైనం**

భద్రాచలం , అక్టోబరు 8 (డిడి9 వార్త)

అర్ధరాత్రి గోదావరి నదిలో వినిపించిన ఓ యువకుడి ఆర్తనాదం.. పోలీసుల అప్రమత్తతతో అతడి ప్రాణాలను కాపాడింది. నదిలో దూకి ప్రవాహంలో కొట్టుకుపోయి ఇసుక దిబ్బ వద్ద చిక్కుకున్న యువకుడిని సీఐ సట్ల రాజు, గజ ఈతగాడు కరుకు ప్రసాద్ సాహసోపేతంగా రక్షించారు.

దుమ్ముగూడెం మండలం గోవిందపురం గ్రామానికి చెందిన జంపన్న (20) బుధవారం రాత్రి మద్యం మత్తులో భద్రాచలం-సారపాక మధ్య గోదావరి వంతెనపై నుంచి నదిలోకి దూకాడు. అదృష్టవశాత్తూ బండరాళ్లకు తగలకుండా నీటిలో పడినప్పటికీ.. కొద్దిసేపటికే స్పృహ కోల్పోయాడు. గోదావరి ప్రవాహానికి కొట్టుకు పోయిన అతడు చివరకు ఓ ఇసుక దిబ్బ వద్ద చిక్కుకున్నాడు.

రాత్రి 2 గంటల సమయంలో..

స్పృహలోకి వచ్చిన జంపన్న ప్రాణభయంతో సహాయం కోసం గట్టిగా కేకలు వేశాడు. అతడి ఆర్తనాదాలను గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే సీఐ సట్ల రాజు ఎలాంటి ఆలస్యం చేయకుండా ఘటనాస్థలానికి చేరుకున్నారు.

గోదావరిలోకి దిగి.. రక్షణ చర్యలు

గజ ఈతగాడు కరుకు ప్రసాద్ సహకారంతో సీఐ సట్ల రాజు గోదావరిలోకి వెళ్లి ఇసుక దిబ్బ వద్ద చిక్కుకున్న జంపన్నను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. అనంతరం అతడిని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు నిర్ధారించారు.

తిరిగి ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడకుండా ముందుజాగ్రత్తగా యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చే వరకు పోలీసుల పర్యవేక్షణలో ఉంచారు. కుటుంబ సభ్యులు వచ్చిన అనంతరం యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించనున్నట్లు సీఐ సట్ల రాజు తెలిపారు. సకాలంలో స్పందించి యువకుడి ప్రాణాలను





కాపాడిన సీఐ సట్ల రాజు, గజ ఈతగాడు కరుకు ప్రసాద్‌ను స్థానికులు అభినందించారు.

మేడిపల్లి ఓసీపీ 'ఫైనల్ మైన్ క్లోజర్' పనుల పరిశీలన

- **మేడిపల్లి ఓసీపీ 'ఫైనల్ మైన్ క్లోజర్' పనుల పరిశీలన**
- **భూ పునరుద్ధరణ పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన ఐ ఐ ఈ ఎస్ టి ప్రొఫెసర్ గంగోపాధ్యాయ**

పెద్దపల్లి బ్యూరో, (డిడీ9 వార్త):

ఆర్జీ1 ఏరియా పరిధిలోని మేడిపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో చేపడుతున్న తుది గని మూసివేత, భూ పునరుద్ధరణ పనులను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, శిబ్‌పూర్‌కు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డా. గంగోపాధ్యాయ నేతృత్వంలోని బృందం గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించింది.

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం గని మూసివేత పనులను థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా తనిఖీ చేయాల్సి ఉండటంతో ఈ పరిశీలన చేపట్టారు. సుమారు 30 ఏళ్లపాటు దేశ ఇంధన అవసరాలకు బొగ్గును అందించిన మేడిపల్లి ఓసీపీలో నిల్వలు పూర్తిగా తగ్గిపోవడంతో 2022లో సింగరేణి యాజమాన్యం ఉత్పత్తిని నిలిపివేసింది.

అనంతరం డీజీఎంఎస్, పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా గని ప్రాంతాన్ని పునరుద్ధరించే పనులను సింగరేణి చేపట్టింది. ఇందులో భాగంగా ఓవర్‌బర్డెన్‌తో ఖాళీ ప్రాంతాలను బ్యాక్‌ఫిల్లింగ్ చేయడం, భూమిని వ్యవసాయానికి అనుకూలంగా చదును చేయడం, నీటి నిల్వలు-నేలకోత నియంత్రణ చర్యలు చేపట్టడంతోపాటు పెద్దఎత్తున మొక్కలు నాటారు.

ప్రొఫెసర్ గంగోపాధ్యాయ మేడిపల్లి ప్రాంతంలో బ్యాక్‌ఫిల్లింగ్ పనుల నాణ్యత, నేల స్థిరత్వం, మొక్కల పెరుగుదలను పరిశీలించారు. గని ప్రాంతాన్ని తిరిగి సాధారణ భూమిగా, అటవీ ప్రాంతంగా తీర్చిదిద్దుతున్న విధానం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఆర్జీ 1 జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ లకిడి రమేష్ మేడిపల్లి మైన్ క్లోజర్ పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇప్పటివరకు జరిగిన వ్యయం, భవిష్యత్ నిర్వహణ ప్రణాళికలను వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆర్జీ1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ విభాగం జీఎం సుజాయ్ ముజెందార్, ఎస్‌వో టు జీఎం కె. చంద్ర శేఖర్, డీజీఎం ఫారెస్ట్ కర్ణ, కార్పొరేట్ పర్యావరణ విభాగం, ప్రాజెక్ట్ ప్లానింగ్ విభాగం అడిషనల్ మేనేజర్లు తిరుపతి, శంకర్, రవీంద్రనాథ్, ఆర్జీ ఏరియా సర్వే ఆఫీసర్ లక్ష్మీరాజం, పర్యావరణ పరిరక్షణ అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన రైతులకు నిరంతర ఆదాయ వనరులు కల్పించాలి

- **ఐటీడీఏ పీఓ బి. రాహుల్**

భద్రాచలం టౌన్ , అక్టోబరు 8 (డిడీ9 వార్త)

మారుమూల గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న చిన్న, సన్నకారు రైతులకు సాంకేతిక సహకారంతో పాటు అవసరమైన మార్గదర్శకత్వం అందించి, వారికి స్థిరమైన, నిరంతర ఆదాయ వనరులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ సూచించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో భారత్ రూరల్ లైవ్లీహుడ్స్ ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కుల్దీప్ సింగ్, మనస్ మర్యాదపూర్వకంగా పీఓను కలిశారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కరకగూడెం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు పీఓ తెలిపారు. రైతుల పొలాల్లో ఇంటి గ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్ అగ్రోహార్టికల్చర్, న్యూట్రి గార్డెన్స్, పంటల వైవిధ్యీకరణ వంటి ప్రదర్శన నమూనాలను ఏర్పాటు చేసి, వాటిని ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేసి విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడంతో పాటు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. సీఈఓ కుల్దీప్ సింగ్ మాట్లాడుతూ గిరిజన రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడంతో పాటు సంబంధిత కార్యక్రమాలకు ఈడీపీఆర్‌లను సిద్ధం చేసి మూడు నెలల్లో సమర్పించేందుకు సహకరిస్తామని తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయం, కన్వర్జెన్స్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులను వినియోగించి మరిన్ని కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయవచ్చన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బృందం సభ్యులు రాజకృపాల్, శ్రీనివాసరావు, సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు.





ముప్పనపల్లి సహాయనిధి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

- **54 మంది రక్తదాతల సహాయం మరువలేనిది**
- **ముప్పనపల్లి సహాయనిధి వాట్సాప్ గ్రూప్ అధ్యక్షులు అబ్బు సతీష్**

కన్నాయిగూడెం, అక్టోబర్ 08(డిడి9 వార్త)



ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే ముప్పనపల్లి సహాయనిధి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలు, తలసేమియా, డయాలసిస్ పేషెంట్స్ కోసం గురువారం రోజున రైతు వేదికలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసారు. మెగా రక్తదాన శిబిరానికి యువత, పార్టీలకు అతీతంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. గురువారం రోజున నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 54మంది స్వచ్ఛంధంగా రక్తదాతలుగా నిలిచారు. మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛంధంగా రక్తదానం చేసిన రక్తదాతల సేవలు మరువలేనివని అధ్యక్షులు అబ్బు సతీష్ అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ముంజ మహేష్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ ప్రణీత్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాడి రాంబాబు,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుబ్బుల సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొల్లె భాస్కర్, బీసీ జేఏసీ మండల అధ్యక్షులు ముదురుకోళ్ల బిక్షపతి, పూజారి కిషోర్,మఠం వెంకటేష్, లక్ష్మిపురం సర్పంచ్ అగ్గు రోజా వెంకటేష్,ముప్పనపల్లి ఉప సర్పంచ్ చిదరి సుమన్,తాడూరి శ్రీధర్, అబ్బు రమేష్, అబ్బు వెంకటనర్సయ్య, మరికాల వెంకటేష్ మరియు ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా ప్రతినిధులు, కావిరి చిరంజీవి,పంతంగి నాగరాజు, గడ్డం రాజబాబు, వాసంపల్లి రమేష్, సునార్కాని మల్లేష్ మరియు ముప్పనపల్లి సహాయనిధి సభ్యులు నామని రాజేష్, కంచె రమేష్, తిప్పనపల్లి విజయ్, రాజు, వెలగందుల నాగరాజు, తడకల రాణాప్రతాప్, వంగర రాజు, కల్వచర్ల నవీన్ మరియు వివిధ పార్టీల రాజకీయ నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గోదావరిలో పడి ఆరేళ్ల బాలుడు మృతి

వాజేడు, అక్టోబర్ 8 (డీడీ9 వార్త):

ములుగు జిల్లా వాజేడు మండలం పూసూరు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గోదావరి నదిలో పడి ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పూసూరు గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్ కుమారుడు కుమ్మరి హేశ్వంత్ (6) స్థానిక పాఠశాలలో మొదటి తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం సుమారు 8:30 గంటల ప్రాంతంలో తోటి బాలురతో కలిసి గోదావరి నది వద్దకు వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నదిలో పడిపోయినట్లు తెలుస్తోంది. బాలుడు నదిలో పడిపోయిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం బాలుడి మృతదేహం లభ్యమైనట్లు సమాచారం.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. ఆరేళ్ల చిన్నారి మృతితో పూసూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న పెద్దమ్మతల్లి ఆలయం.

మణుగూరు. అక్టోబర్ 8 (డి డి 9వార్త)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,కరకగూడెం మండలం, బట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లవాగు పెద్దమ్మతల్లి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నవ రాత్రుల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ పరిసరాలను శుభ్రం చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రుల రోజుల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ, నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ, వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు..

- **బతుకమ్మ నిమజ్జన ఘాట్లను పరిశీలించిన ప్రజా ప్రతినిధులు.**

మణుగూరు. అక్టోబర్ 8 (డి డి 9వార్త)

పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు..
మణుగూరు మండలం,సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో గల అరుంధతి నగర్, అశోక్ నగర్, సాయి నగర్ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలకు సంబంధించిన బతుకమ్మ నిమజ్జన ఘాట్ లను గురువారం నాడు సమితిసింగారం గ్రామపంచాయతీ కి చెందిన ప్రజాప్రతినిధులు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలకు తెలంగాణ ఆడబిడ్డలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేయడం జరుగుతుందని వారు తెలియజేసారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు కోలపిన్ని మానస, మాదాడి రాజేష్, పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖనికి ఈ నెల 14న కేటీఆర్.

డిడి9వార్త / రామగుండం అక్టోబర్ 9:

గోదావరిఖని: బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ (కే.టి. రామారావు) ఈ నెల 14వ తేదీన గోదావరిఖనికి రానున్నట్లు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి తెలిపారు. గోదావరిఖనిలోని జియం, కాలనీ గ్రౌండ్లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి కేటీఆర్ హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

భద్రాచలం టౌన్ , (డిడీ 9 వార్త)

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలంలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను విద్యార్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని, ఇది మహిళల ఐకమత్యానికి,స్ఫూర్తికి ప్రతీక అని ఆయన అన్నారు. ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, కోలాట నృత్యాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ వెల్లంకి రాఘసుమ, అకాడమిక్ కోఆర్డినేటర్ హిమజ, అధ్యాపకులు హవీలా, కపిల భారతి, డాక్టర్ సమీర, శరణ్య, భవాని, కల్పన, పావని, ఊర్వశి, శశికళ, పూర్ణిమ, కృష్ణవేణి, ఆఫీస్ సూపరింటెండెంట్ రేవతి తదితరులు పాల్గొన్నారు



జనగామకాంగ్రెస్ ఎస్సీ డిపార్టుమెంట్ జిల్లా కార్యదర్శిగా బొట్ల విజయ్ కుమార్

జనగాం అక్టోబర్ 8(డిడి9) వార్త

జనగామ: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్టుమెంట్ జనగామ జిల్లా కార్యదర్శిగా యశ్వంతపూర్ గ్రామానికి చెందిన బొట్ల విజయ్ కుమార్ నియమితులయ్యారు. జనగామ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, ఎస్సీ డిపార్టుమెంట్ జిల్లా చైర్మన్ వేముల మల్లేష్ చేతుల మీదుగా విజయ్ కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దలకు విజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.





పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇల్లు సాకారం

- **అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి**
- **ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

శాయంపేట, అక్టోబరు 8, డి డి 9వార్త

పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం హన్మకొండ జిల్లా శాయంపేట మండలం మందారిపేట గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని లబ్ధిదారులు వల్లపు శోభ-దిలీప్ కుటుంబంతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంతింటిని కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు నాణ్యమైన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు.ఇల్లు ప్రతి పేద కుటుంబానికి భద్రతతో పాటు ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ములుగులో బార్ అండ్ రెస్టారెంట్ కి నోటిఫికేషన్

- **విడుదల చేసిన ఎక్సైజ్ కమిషనర్**
- **ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు**
- **ములుగు ఎక్సైజ్ అధికారి సుధాకర్**

ములుగు మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్ అండ్ రెస్టారెంట్‌కు సంబంధించి సి. హరికిరణ్, ఐ.ఏ.ఎస్., ఎక్సైజ్ కమిషనర్, T.G. హైదరాబాద్ గారి ఉత్తర్వుల ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేయడమైనది. దీనికి సంబంధించి ఆసక్తి గల వారు ఒక లక్ష రూపాయల దరఖాస్తు రుసుము చెల్లించి, ఆధార్ కార్డ్ మరియు పాన్ కార్డ్‌లను జతపరిచి తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. ఇట్టి బార్ యొక్క వార్షిక రుసుము రూ॥ 30,00,000/ గా ఉన్నట్లు మరియు ఇట్టి రుసుమును నాలుగు విడతలుగా చెల్లించవలసి ఉంటుందని ములుగు & జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీ బి. కిరణ్ గారు తెలియజేసారు.

తాజా నిబంధనలు & దరఖాస్తు పొడిగింపు వివరాలు

సెలవు దినాల్లోనూ కౌంటర్లు ఓపెన్: దరఖాస్తుదారులు శుభదినాలలో దరఖాస్తులు సమర్పించడానికి ఆసక్తి చూపుతుండటం మరియు చివరి తేదీకి రద్దీని నివారించేందుకు గాను, సాధారణంగా ప్రభుత్వ సెలవు దినాలైన 10102026 (రెండవ శనివారం) మరియు 11102026 (ఆదివారం) రోజులలో కూడా దరఖాస్తులను స్వీకరించడానికి ప్రభుత్వం ప్రత్యేక అనుమతి మంజూరు చేసింది.


* కౌంటర్ల సమయాలు: సదరు సెలవు దినాలలో (శని, ఆదివారాలు) ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ కార్యాలయం మరియు డిప్యూటీ కమిషనర్, వరంగల్ కార్యాలయాల్లో కౌంటర్లు తెరిచి ఉంచబడతాయి.

* చివరి తేదీ: దరఖాస్తులు సమర్పించడానికి ఆఖరి గడువు 12.10.2026 (సాయంత్రం 5:00 గంటల వరకు) మాత్రమే ఉంటుంది. చివరి రోజు రద్దీని నివారించడానికి దరఖాస్తుదారులు ఈ అదనపు సెలవు దినాల అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరడమైనది.

అర్హులైన ఓటర్లను పరిరక్షించాలని నిరసన

చర్ల, అక్టోబర్ 8 (డిడి 9 వార్త)

ఏఐసీసీ, టీపీసీసీ, డీసీసీ నాయకత్వంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పిలుపు మేరకు నిర్వహించిన ఓటు చోరీ ఓటు పరిరక్షణ నిరసన ర్యాలీలో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ పౌరుల ఓటు హక్కును పరిరక్షించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన అసలైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేస్తూ, అప్రజాస్వామిక పద్ధతుల్లో అధికారాన్ని కైవసం చేసుకునే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



2028 సంవత్సరములో జరగబోయే మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర భక్తుల కోసం మేడారం భక్తుల కోసం స్నాన ఘట్టాలు

- **21 కోట్ల 25 లక్షలు రూపాయలు ప్రతిపాదించిన ఇరిగేషన్ డిపార్ట్మెంట్**
- **ఊరట్టం కాజువే నుండి చిలకల గుట్ట వరకు**

తాడ్వాయి డిడి9 వార్త

2028 సంవత్సరంలో జరగబోయే మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర భక్తుల కోసం ఇరిగేషన్ డిపార్ట్మెంట్ భారీ స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసింది 21 కోట్ల 25 లక్షల రూపాయలతో జంపన్న వాగుకు ఊరట్టం సైడ్ ఊరట్టం కాజువే నుండి చిలకల గుట్ట వరకు 900 మీటర్లు స్నాన గట్టాలు (మెట్లు) కోసం ఇటీవలే ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సర్వే చేసి ప్రభుత్వంకు నివేదిక పంపారు. ఊరట్టం ప్రాంతంలో పార్కింగ్ చేసిన భక్తులకు సౌకర్యం ఏర్పాటుతో పాటుగా ఊరట్టం రైతులకు వరదల సమయంలో వాగు భూమి కోతకు గురి కాకుండా శాశ్వత పరిష్కారం చూపినట్లు అవుతుంది



ఇసుక లారీ బీభత్సం.. పోలీసు వాహనం ధ్వంసం..!

- **మొండ్యాలతొగు అడవిలో ఘోర రోడ్డు ప్రమాదం.. సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి**
- **ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఇసుక లారీల వేగంపై ప్రయాణికుల ఆగ్రహం**

ఏటూరునాగారం క్రైం, డి డి 9 వార్త, అక్టోబర్ 8:

ములుగు జిల్లా తాడ్వాయి-పస్రా మధ్య అటవీ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మొండ్యాలతొగు సమీపంలో వేగంగా వచ్చిన ఇసుక లారీ పోలీసు వాహనాన్ని బలంగా ఢీకొనడంతో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రమాకాంత్ మృతి చెందగా,మరో ఇద్దరు గాయపడినట్లు ప్రయాణికులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు పోలీసు వాహనం తీవ్రంగా ధ్వంసమైంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం..ఏటూరునాగారం వైపు నుంచి సీఆర్పీఎఫ్ పోలీసు వాహనం ములుగు వైపు వెళ్తుండగా, హనుమకొండ వైపు నుంచి ఇసుక లారీ ఏటూరునాగారం వైపు వస్తోంది. అదే సమయంలో మరో కారు తాడ్వాయి వైపు వెళ్తున్న క్రమంలో మొండ్యాలతొగు వద్ద మూడు వాహనాలు ఎదురెదురుగా వచ్చినట్లు తెలిపారు.ఈ క్రమంలో ఇసుక లారీ పోలీసు వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో వాహనం తీవ్రంగా ధ్వంసమైంది.ఈ ప్రమాదంలో పోలీసు వాహనంలో ప్రయాణిస్తున్న రమాకాంత్ అనే సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.మరో ఇద్దరు గాయపడగా వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన మరో కారు కూడా ఇసుక లారీ కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయినట్లు ప్రయాణికులు తెలిపారు.



అడవిలో పోలీసు జవాన్ల ఆర్తనాదాలు..

మొండ్యాలతొగు అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంతో ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది. ప్రమాదం జరిగిన వెంటనే రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు,స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనను చూసిన పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు తరలించగా, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఇసుక లారీల వేగానికి అడ్డుకట్ట ఎప్పుడు...?

అటవీ ప్రాంతంలో ఇసుక లారీల రాకపోకలు,వాటి వేగంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల వేగాన్ని నియంత్రించడంతో పాటు రోడ్డు భద్రతా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటివరకు ఇసుక లారీల ప్రమాదాల్లో సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పుడు విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది కూడా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.“ప్రాణాలు పోయిన తర్వాత స్పందించడం కాదు..ప్రమాదాలు జరగకుండా ముందే చర్యలు తీసుకోవాలి” అని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.ఇసుక లారీల వేగం, రవాణా నిబంధనలు,అనుమతులు, డ్రైవర్ల నిర్లక్ష్యంపై సమగ్రంగా తనిఖీలు చేపట్టి,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని ప్రజలు కోరుతున్నారు.









PRTU-TS ములుగు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

- **ములుగు జిల్లా అధ్యక్షునిగా వేమియాకుబ్ రెడ్డి**
- **ప్రధాన కార్యదర్శిగా కోకిల శ్రీరంగం**
- **పిఆర్టియు సంఘంతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం**
- **రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్**
- **సంఘం నియమావళి చైర్మన్ సుబాకర్ రెడ్డి**

ములుగు, డీ డీ 9 వార్త, అక్టోబర్ 8:

PRTUTS జిల్లా ఎన్నికల నేపథ్యంలో ఈరోజు ములుగులోని రాయల్ ప్లాజాలో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వేమ్ యాకూబ్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి PRTUTS రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. బిక్షం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. ముఖ్యంగా PRC, EHS, CPS, పెండింగ్‌లో ఉన్న DAలు వంటి ప్రధాన సమస్యలను ప్రస్తావించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు.

అలాగే ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం సంఘం మరింత ఐక్యంగా పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా PRTUTS రాష్ట్ర సంఘ నియమావళి కమిటీ చైర్మన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు శ్రీ ఆర్. శుభాకర్ రెడ్డి మాట్లాడుతూ, GO 317 ప్రకారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జారీ చేసిన GO 190ను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పెన్షనర్లకు అందిస్తున్న విధంగానే ఉద్యోగులకు కూడా నెలవారీ మెడికల్ అలవెన్స్ అందించాలని ఆయన కోరారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ములుగు జిల్లాలోని అన్ని మండలాల PRTUTS అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, అలాగే జిల్లా మరియు రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు. జిల్లా సంఘాన్ని మరింత బలోపేతం చేయడం, ఉపాధ్యాయుల సమస్యలను సమిష్టిగా ముందుకు తీసుకెళ్లడం, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు.



నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

సమావేశం ముగింపులో PRTUTS ములుగు జిల్లా అధ్యక్షుడిగా వేమ్ యాకూబ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె. శ్రీరంగం ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు రాష్ట్ర, జిల్లా మరియు మండల నాయకులు అభినందనలు తెలిపారు. నూతన నాయకత్వం ఆధ్వర్యంలో ములుగు జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడి సమస్యను తమ సమస్యగా భావించి, ఉపాధ్యాయుల హక్కులు మరియు సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని నాయకులు స్పష్టం చేశారు. PRC, EHS, CPS, పెండింగ్ DAలు, ఉద్యోగుల వైద్య సదుపాయాలు, GO 190 అమలు తదితర అంశాల టీవీ పరిష్కారం కోసం సంఘటితంగా కృషి చేస్తూ, ఉపాధ్యాయుల ప్రయోజనాల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా PRTUTS ములుగు జిల్లా నూతన కార్యవర్గం పనిచేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల ఐక్యతే సంఘానికి బలం — ఉపాధ్యాయుల సంక్షేమమే PRTUTS ప్రధాన ధ్యేయం అని నాయకులు పేర్కొన్నారు.

ప్రజా సేవలో తాడ్వాయి తహసీల్దార్‌ది ప్రత్యేక ముద్ర!

- **రైతు సమస్యలకు తక్షణ పరిష్కారం.. విద్యార్థులకు వెన్నుదన్నుగా సేవలు**
- **ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా విధులు.. జిల్లా స్థాయిలో ప్రశంసలు**

ఏటూరునాగారం క్రైం , వార్త అక్టోబర్ 8:


ప్రజాసేవే పరమావధిగా విధులు నిర్వహిస్తూములుగు జిల్లా తాడ్వాయి మండల ప్రజల మన్ననలు పొందుతున్న తహసీల్దార్ సురేష్ బాబు సేవలు ప్రశంసలు అందుకుంటున్నాయి.రైతులు, విద్యార్థులు,సామాన్య ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు వారి సమస్యలను ఓపికగా విని, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారని ప్రజలు అభినందిస్తున్నారు.మారుమూల గ్రామాల నుంచి ధ్రువపత్రాల కోసం వచ్చే విద్యార్థులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా అవసరమైన ప్రక్రియను వేగంగా పూర్తి చేసి పంపిస్తున్నారని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల్లో చిన్నచిన్న పనుల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంటే.. తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం అభినందనీయమని రైతులు చెబుతున్నారు.

గ్రామసభల్లోనే సమస్యలకు పరిష్కారం..

గ్రామసభల్లో ప్రజలు అందజేసే అర్జీలను అక్కడికక్కడే పరిశీలించి, సాధ్యమైన సమస్యలకు వెంటనే పరిష్కారం చూపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని గ్రామీణులు చెబుతున్నారు.దీంతో తాడ్వాయి మండలంలో రెవెన్యూ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని అంటున్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియలోనూ లబ్ధిదారులు, రెవెన్యూ అధికారులు,పోలీసు,అటవీశాఖ అధికారుల మధ్య సమన్వయం చేస్తూ పనులు ముందుకు తీసుకెళ్లడంలో తాడ్వాయి మండల అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

కలెక్టర్ ప్రశంసలు.. మంత్రి అభినందనలు...

తాడ్వాయి మండల అధికారులు ప్రజలతో మమేకమై పనిచేస్తున్న తీరుపై జిల్లా కలెక్టర్ పలు సందర్భాల్లో ప్రశంసలు వ్యక్తం చేసినట్లు ప్రజలు గుర్తుచేస్తున్నారు. ప్రజల సమస్యలు బయటకు రాకముందే వాటిని పరిష్కరించే విధంగా అధికారులు స్పందించడం అభినందనీయమని కలెక్టర్ప్రశంసించిన సందర్భాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. మరోవైపు మంత్రి సీతక్క సైతం తాడ్వాయిలో పనిచేసిన తహసీల్దార్ల సేవలను ప్రస్తావిస్తూ ప్రజల అభిమానం పొందడం గొప్ప విషయమని పేర్కొన్నారని స్థానికులు గుర్తుచేస్తున్నారు.గతంలో తాడ్వాయిలో పనిచేసిన తహసీల్దార్లు శ్రీనివాస్,సురేష్ బాబుతో పాటు ప్రస్తుతం మంగపేటలో పనిచేస్తున్న తోట రవీందర్ వంటి అధికారులు ప్రజల మన్ననలు పొందడం తాడ్వాయి మండలానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని చెబుతున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తే ప్రభుత్వ కార్యాలయాలపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందనడానికి తాడ్వాయి రెవెన్యూ శాఖ పనితీరు నిదర్శనంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పంజాబ్ కింగ్స్‌కు డబుల్ షాక్.. ఇద్దరు కీలక కోచ్‌లు గుడ్‌బై

- **పంజాబ్ కింగ్స్ కోచింగ్ సిబ్బందిలో కీలక మార్పులు**
- **ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ రాజీనామా**
- **ఆస్ట్రేలియా దేశవాళీ జట్లకు హెడ్ కోచ్‌లుగా బాధ్యతలు స్వీకరణ**
- **ఇప్పటికే స్పిన్ కోచ్ కూడా దూరం కావడంతో పాంటింగ్‌కు పెరిగిన ఒత్తిడి**
- **గత సీజన్‌లో అద్భుతంగా ఆరంభించి ప్లేఆఫ్స్ చేరడంలో విఫలమైన పంజాబ్**


డీడీ9 వార్త :

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ తమ పదవుల నుంచి తప్పుకున్నారు. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లో కీలక బాధ్యతలు చేపట్టాల్సి రావడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. వీరి నిష్క్రమణతో హెడ్ కోచ్ రికీ పాంటింగ్ నేతృత్వంలోని కోచింగ్ బృందంలో పెద్ద లోటు ఏర్పడింది.

జేమ్స్ హోప్స్ క్వీన్స్‌లాండ్, బ్రిస్బేన్ హీట్ జట్లకు హెడ్ కోచ్‌గా నియమితుడు కాగా, బ్రాడ్ హాడిన్ న్యూ సౌత్ వేల్స్ జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఇదివరకే పంజాబ్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న సైరాజ్ బహుతులే భారత జట్టు కోచింగ్ సిబ్బందిలో చేరగా, ఇప్పుడు మరో ఇద్దరు కీలక సభ్యులు దూరం కావడం పంజాబ్ యాజమాన్యానికి కొత్త సవాలుగా మారింది.

హోప్స్ గత రెండు సీజన్లుగా పంజాబ్ జట్టుతో కొనసాగుతున్నాడు. గతంలో అతడు పాంటింగ్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ బృందంలోనూ పనిచేశాడు. బ్రాడ్ హాడిన్ 2022 నుంచి పంజాబ్ కోచింగ్ సిబ్బందిలో సభ్యుడిగా ఉన్నాడు. ప్రస్తుతం వీరిద్దరూ ఆస్ట్రేలియాలో జరుగుతున్న షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో తమ కొత్త బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

రికీ పాంటింగ్ 2025 సీజన్ కోసం పంజాబ్ జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. గత సీజన్ (2026)లో పంజాబ్ జట్టు అద్భుతమైన ఆరంభాన్ని అందుకుని, వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అయితే ఆ తర్వాత అనూహ్యంగా తడబడటంతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ గెలవని పంజాబ్, 2014, 2025 సీజన్లలో ఫైనల్‌కు చేరినప్పటికీ రన్నరప్‌గానే మిగిలిపోయింది.



ఇసుక లారీల వల్ల వచ్చే దుమ్ము , ధూళితో ధ్వంసమవుతున్న పంటచేలు..

- **ప్రభుత్వం ఆదుకోవాలని కట్టు మల్లారం గన్నెబోయిన గుంపు రైతుల ఆవేదన.**
- **పంటచేలను పరిశీలించిన మండల బిఆర్ఎస్ నాయకులు.**

మణుగూరు. అక్టోబర్ 8 (డి డి 9వార్త)

భద్రాద్రి జిల్లా, మణుగూరు మండలం లోని కట్టు మల్లారం మరియు గన్నేబోయిన గుంపు పేద గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న టువంటి పత్తి చేలు గోదావరి ఇసుక ర్యాంపు నుండి ఇసుక రవాణా చేస్తున్నటువంటి లారీలు పంటచేల పక్కనుండే వందల సంఖ్యలో వెళ్తూ వస్తూ ఉండడంతో పత్తి చేలు లారీల నుండి వచ్చే దుమ్ముకి పూర్తిగా ధ్వంసమై పోయే పరిస్థితి ఉన్నదని, ఇప్పటికే చాలా వరకు పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నాడు మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆ పంట పొలాలను పరిశీలించి వారి యొక్క సాధక బాదకాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, సన్న, చిన్న కారు రైతులమైన మేము మనిషికి ఎకరం, రెండు ఎకరాలు నానా రకాల ఇబ్బందులు పడుతూ అప్పులు తెచ్చి ఈ యొక్క పత్తి సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడు ఈ ఇసుక లారీలు రాత్రి పగలు తిరగటం వలన మేము చాలా ఇబ్బందులు పడుతున్నాము, మా పంటలు కూడా పాడైపోతున్నాయని తెలియజేశారు.

గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారు స్పందించి తక్షణమే ఈ రహదారిపై నీళ్లు చల్లించి పేద గిరిజన రైతుల యొక్క పత్తిచేలను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు.

రైతులు ఇసుక కాంట్రాక్టర్లను రోడ్డుపై దుమ్ము, ధూళి లేవకుండా నీళ్లు చల్లించండి అని ప్రాధేయపడితే తూతు మంత్రంగా రెండు మూడు రోజులకు లేదా వారానికి ఒకసారి అరకొరగా నీళ్లు చల్లుతున్నటువంటి పరిస్థితి ఉందని, కావున కలెక్టర్ గారు ఈ విషయమై స్పందించి తమ పంటలను కాపాడాలని రైతులు వేడుకోవడం జరిగింది.



ఈ కార్యక్రమంలో రైతులు జగడి ప్రసాదు, జగడి వెంకటయ్య, పెనుబల్లి సమ్మయ్య, ఉబ్బ భద్రమ్మ, జగడి చలపతిరావు, జ్యోతి, నూకరాజు, గనిబోయిన నాగేశ్వరరావు, పెనుబల్లి చిట్టిబాబు మరియు మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ మండల అధ్యక్షులు సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి పోశం నరసింహారావు, హోటల్ రాంబాబు, అడప అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, ప్రభుదాస్, ఆవుల నరసింహారావు, వేల్పుల సురేష్, గుమ్మల రాంబాబు, సకిని బాబురావు, తురక రామకోటి, పోడుతూరి విక్రమ్, బర్ల సురేష్, యువజన నాయకులు బోశెట్టి రవి, గుర్రం సృజన్, జక్కం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.





జోహార్లు అర్పిస్తున్నాను ఆదివాసి గుండెల్లో జ్యోతులు వెలిగించిన నేతకు జోహార్లు అర్పిస్తున్నాను

తాడ్వాయి DD9 వార్త

ఆదివాసీ గుండెల్లో జ్యోతులు వెలిగించిన నేతకు
స్వయపాలన స్వావలంబనకు నెత్తుటి విత్తులు నాటిన నేతకు
జోహార్లు అర్పిస్తున్నాను
అడవితల్లి పురిటి నొప్పులను
గూడెం బిడ్డల చావు కేకలను
ఆకలితో ఎండిన డొక్కల
బక్కపల్చని గూడెం జీవుల
కష్టాలను చూసినువ్వు
బంధుక్ ఎక్కుబెట్టి
బ్రతుకు బాట చూపినోడా!
రాంజీ గోండు బాటలోన
రణం జేయ ఉరికినోడా!

జోహార్లు అర్పిస్తున్నాను

నీటికోసం అడవి కోసం పుట్టిపెరిగిన నేలకోసం
పటేల్ పట్వారి దొరలను
పరుగులు పెట్టించినోడా
జంగ్లాత్ అమీను సాబును
అడ్డగించి ఎదురించినోడా!
గూడెం గుండెకు నువ్వే తుడుం మోతల చప్పుడైతివి
జోహార్లు అర్పిస్తున్నాను
రజాకార్ మూకలకు
కంటిలో నలుసైనవ్
కాలిలో ముళ్లయినవ్
గుండెల్లో గుబులైనవ్
సంకెనపల్లికి అండయినవ్
అన్నీ గుడాలకు తోడైనవ్
ఆదివాసిల నేటి హక్కులకు
నీరుదిరం దారైంది!
ఓ వీరుడా జోహార్లు
అర్పిస్తున్నాను
గూడెంలోనా అడవిలోన
అడవి బ్రతుకులు చిదిమి పోతే!
శావుకార్ల రజాకార్ల వెట్టి
హింసల కళ్ళజూచి
ఉడుకునెత్తిరు ఉప్పనై
రజాకార్ సిద్దీకినీ ఉరికించి చంపినావు
అడవి జీవుల బ్రతుకులల్లో
కొత్త ఆశలు రేపినావు
ఓ వీరుడా
జోహార్లు అర్పిస్తున్నాను
చాయ్ పత్తాదేశంపోయి
అక్షరాలు నేర్చుకోనీ
విప్లవాలా గుర్తువై
మళ్ళీ గూడెం కొస్తివా
మార్పుకోసం నిజాం చుట్టూ తిరిగి అలిసి పోతివా
జల్ జంగిల్ జమీన్ అంటూ
జంగ్ సైరన్ వేస్తివా
తుడుం మోతల చప్పుడులో ఇప్పటికి మోగుతుంటివా!
జోహార్లు అర్పిస్తున్నాను
బల్లెం బాణం అందుకొని
భరిశే గొడ్డలి ఎత్తుకొని
కొడవలి కత్తి పట్టుకొని
కత్తుల వంతెన దాటుకొని
అడివిల ఉరుమై
కంటిలో మెరుపై
జోడెన్ గాడ్ చేరుకొని
నిజాం ముష్కర దౌర్జన్యానికి
సవాల్ విసిరిన సారధికి
జోహార్లు అర్పిస్తున్నాను
నీ రణం ఒక స్థైర్యం
నీ ధైర్యం ఒక మార్గం
నీ పోరాటం ఒక దిక్సూచి
నీ మరణం ఒక విప్లవం
నీ త్యాగం ముందు తరాల భవిష్యత్తు
నీవేత్తిన రగల్ జెండా
ప్రపంచానికి కొత్త పరిచయం

రచన :
కల్తీ. క్రిష్ణమూర్తి
AHS. రాయినిగూడెం
సెల్. నెం :9494036818



గుండాల ఆసుపత్రి సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారు?

- **రెగ్యులర్ వైద్యుడిని వెంటనే నియమించాలి**
- **జిల్లా వైద్యాధికారులు, ఎమ్మెల్యే స్పందించి స్పష్టమైన హామీ ఇవ్వాలి**
- **రెండో రోజుకు చేరిన సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నిరవధిక నిరాహార దీక్షకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సంఘీభావం**

గుండాల అక్టోబర్ 8 (డిడి 9వార్త).

గుండాల మండల ప్రభుత్వ ఆసుపత్రికి రెగ్యులర్ వైద్యుడిని నియమించడంతో పాటు ఆసుపత్రిలో నెలకొన్న వైద్య సదుపాయాల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. దీక్షకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి కోరం శాంతయ్య, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పూనెం మంగయ్య మాట్లాడుతూ గుండాల మండలంలోని అనేక గ్రామాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్య ఆధారంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు తక్షణ వైద్యం కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయిస్తారని తెలిపారు. అలాంటి ఆసుపత్రిలో రెగ్యులర్ వైద్యుడు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో చిన్నపాటి అనారోగ్య సమస్యలకు కూడా ప్రజలు దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తే అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు ఆలస్యం అయితే రోగుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందన్నారు.

ప్రజలకు అత్యవసరమైన వైద్య సేవలకు సంబంధించిన సమస్య ఇంతకాలం కొనసాగుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు పూర్తి స్థాయిలో స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి రెగ్యులర్ వైద్యుడిని నియమించేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలను జిల్లా వైద్యాధికారులు ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి నిర్దిష్టమైన చర్యలు చేపట్టి ప్రజలకు నమ్మకం కల్పించాలని అన్నారు.


ప్రజల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి రెగ్యులర్ వైద్యుడిని నియమించాలనే డిమాండ్‌తో ప్రజా సంఘాలు చేపట్టిన నిరాహార దీక్ష రెండో రోజుకు చేరినా సమస్యకు స్పష్టమైన పరిష్కారం కనిపించకపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. జిల్లా వైద్యాధికారులు, నియోజకవర్గ ఎమ్మెల్యే వెంటనే స్పందించి దీక్ష చేస్తున్న నాయకులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

"గుండాల మండల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండాలి. రెగ్యులర్ వైద్యుడు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని వెంటనే పరిష్కరించాలి. సమస్యపై స్పష్టమైన హామీ ఇవ్వాలి" అని నాయకులు డిమాండ్ చేశారు.

ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమస్యను కేవలం ఒక సంస్థ లేదా రాజకీయ పార్టీ సమస్యగా చూడకుండా మండల ప్రజలందరి సమస్యగా పరిగణించి పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిని బలోపేతం చేసి, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రెగ్యులర్ వైద్యుడి నియామకంతో పాటు ఆసుపత్రిలో ఉన్న ఇతర సమస్యలను కూడా గుర్తించి దశలవారీగా పరిష్కరించాలని, వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజా ఉద్యమానికి తమ సంఘీభావం, మద్దతు కొనసాగుతుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఇల్లెందు డివిజన్ పార్టీ కార్యదర్శి ఈసం శంకరన్న, ఊకే శ్రావణ్, తెల్లం రాజు, కోడూరి జగన్, సనప కృష్ణ, టీయూసీఐ నాయకులు గడ్డ రమేష్, ఎస్.కె. వికల్ తదితరులు పాల్గొని నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు.



ప్రజా పోరాటాలే గుర్రం వెంకటేశ్వర్లుకు ఘన నివాళి..

- **పీడితుల పక్షాన పోరాడిన యోధుడి ఆశయాలను కొనసాగిద్దాం..**
- **సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్**

అక్టోబర్ 8:డిడి9 వార్త వెంకటాపురం.

పీడిత ప్రజలు, కార్మికులు, పేదల పక్షాన నిలబడి జీవితాంతం పోరాడిన కామ్రేడ్ గుర్రం వెంకటేశ్వర్లు ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు.

వెంకటాపురం మండల కేంద్రంలో గుర్రం వెంకటేశ్వర్లు 16వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు వ్యాపారాన్ని సైతం వదిలి ప్రజా ఉద్యమాలకు అంకితమైన గుర్రం వెంకటేశ్వర్లు, కడవరకు ఎర్రజెండాను వీడని పోరాట యోధుడని కొనియాడారు. పేదలు, కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తుచేశారు.

అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి బస్టాండ్ సెంటర్‌లోని గుర్రం వెంకటేశ్వర్లు స్మారక స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ వంకా రాములు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి.రెడ్డి సాంబశివ, మండల కార్యదర్శి గ్యానం వాసు, గుర్రం పుల్లారావు, కొప్పుల రఘుపతి, కుమ్మరి శీను, వెంకటరెడ్డి, దావూద్ తదితరులు పాల్గొన్నారు.



అటవీ ప్రాణి సంరక్షణ అందరి బాధ్యత

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 08: (డిడి 9 వార్త న్యూస్):

బోథ్: అటవీ ప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఎస్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో అటవీ ప్రాణి సంరక్షణ సప్తహ కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఎఫ్‌బీఓ పవర్ ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై, అటవీ సంపద, వన్య ప్రాణుల ప్రాధాన్యత, వాటి సంరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత గురించి విద్యార్థులకు వివరించారు. వన్యప్రాణులను వేటాడకుండా, వాటి ఆవాసాలను కాపాడుతూ పర్యావరణ సమతుల్యతను పరిరక్షించాలని సూచించారు.

ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఈ. రాజశేఖర్ మాట్లాడుతూ, ప్రకృతి మరియు వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులు అవగాహన పెంచుకొని, సమాజంలో చైతన్యం తీసుకురావాలని అన్నారు.

కళాశాల ప్రిన్సిపల్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు ప్రకృతి సంరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల సభ్యులు కే. పోశెట్టి, అధ్యాపకులు మరియు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



కూనవరం గ్రామపంచాయతీ లో ముందస్తు బతుకమ్మ సంబరాలు.

- **కూనవరం యూత్ ఆధ్వర్యంలో బతుకమ్మ పాట చిత్రీకరణ.**

మణుగూరు. అక్టోబర్ 8 (డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని,కూనవరం గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం నాడు ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కూనవరం గ్రామం లోని యూత్ ఆధ్వర్యం లో ముసలి విజయ్, మరియు కొప్పుల రామకృష్ణ అనే ఇద్దరు యువకులు కలసి చేసిన బతుకమ్మ పాటను కూనవరం గ్రామంలో చిత్రీకరించారు. సర్పంచ్ శ్రీమతి ఎనిక శ్వేత ఆధ్వర్యం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూనవరం గ్రామం లోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, రంగు రంగుల పూలతో బతుకమ్మలను తయారుచేసుకుని వచ్చి ఉత్సాహంతో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ ఆడి పాడి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు, యువతకు,గ్రామస్థులకు సర్పంచ్ కృతజ్ఞతలను తెలియజేశారు.



బాధిత కుటుంబాలను పరామర్శించి. ఆర్థిక సహాయం అందించి

అదిలాబాద్ జిల్లా
తలమడుగు మండలం (డిడి9 వార్త)

తలమడుగు మండలం కోడత్ గ్రామానికి చెందిన. జానీ రవీందర్. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. విషయాన్ని తెలుసుకొని కోడత్ గ్రామానికి వెళ్లి. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి. వారికి మరో ధైర్యాన్ని ఇచ్చి కొంత ఆర్థిక సహాయం అందించారు. మీకు మీ కుటుంబానికి. ఎల్లప్పుడూ తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని బోథ్ మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షుడు. రాథోడ్ బాపూరావు అన్నారు. (మృతుడు) జానీ రవీందర్ కి చెందిన ఇద్దరు పిల్లల. చదువు విషయమై. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తనను సంప్రదించాలని. వారికి తెలియజేశారు. అనంతరం. సుంకిడి గ్రామానికి చెందిన సాదా పోతన భార్య. సాదా రుకుం భాయ్. అనారోగ్య కారణాల వలన. మరణించడంతో వారి ఇంటికి వెళ్లి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని. మృతురాలి కుటుంబానికి తన ప్రగడ సానుభూతిని తెలియజేస్తూ ఈ కష్టా సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ. వారి కుటుంబానికి కూడా. తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. మీ కుటుంబానికి. అవసరమైన సహాయ సహకారాలు. అందించేందుకు. తెలంగాణ రక్షణ సేన పార్టీ తరపున. ఎల్లప్పుడు ముందు ఉంటానని. మీరు అధైర్య పడకుండా ఉండాలని. వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో. మండల కన్వీనర్. నిమ్మల గజానన్. నాయకులు శివాజీ గడుగు పొచ్చన్న. శ్రీనివాస్. బోండ్ల రమేష్. స్థానిక సర్పంచ్ ప్రకాష్. ఆశన్న యాదవ్ అజయ్. తదితరులు ఉన్నారు





తుడుం దెబ్బ పిలుపు

- హలో ఆదివాసి. చలో హైదరాబాద్

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం(డి డి 9 వార్త)

తలమడుగు మండలం. ఝరి గ్రామంలో. పటేల్. మహాజన్. దేవారి. మరియు గ్రామ సర్పంచ్. ఆధ్వర్యంలో. హలో ఆదివాసి. చలో హైదరాబాద్. కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసులపై జరుగుతున్న దాడులు అన్యాయాలు. అరికట్టేందుకు 14102026 న. హైదరాబాద్. ఇందిరా పార్క్ లో జరిగే కార్యక్రమానికి. తలమడుగు మండలంలో ఉన్న ఆదివాసీలు పెద్ద ఎత్తున. హాజరై కార్యక్రమాన్ని. విజయవంతం చేయాలని. తలమడుగు మండలం. తుడుం దెబ్బ నాయకుడు. వర్కింగ్ ప్రెసిడెంట్. గోడం భుజంగరావు మరియు. షెడ్మకి మాణిక్ రావ్ లు. ఒక ప్రకటన లో పేర్కొన్నారు. తరాలు మారినా. ఆదివాసుల బతుకులు మాత్రం మారడం లేదు. ప్రధాన డిమాండ్లైన లంబాడీలను ఎస్టి జాబితా నుండి తొలగించడం. మరియు ఏజెన్సీ ప్రాంతంలో పక్క అమలు కానీ1/70 చట్టాల గురించి. హైదరాబాదులో. పెద్ద ఎత్తున. ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు. పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో.ఝరి. సర్పంచ్. మేస్త్రం రూప. కాశీరాం. గ్రామ పటేల్. పేందూర్ జైతు మహాజన్. పేందూర్ మాధవరావు. మరియు ఆదివాసి కుల పెద్దలు. యువకులు పాల్గొన్నారు



ప్రభుత్వ బడులకు కొత్త రూపు.. విద్యార్థులకు ఉచిత యూనిఫార్మ్‌లు

నిజామాబాద్, అక్టోబర్ 08 (డీడీ 9 వార్త):

కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత యూనిఫార్మ్‌లను సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. విద్యార్థులు అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో గెజిటెడ్ హెడ్‌మాస్టర్ కె. రాజన్న, హెడ్‌మాస్టర్ గిరిధర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్, వార్డు సభ్యుడు అజయ్, నడుకుడా క్రాంతిరెడ్డి, పెసరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

టాస్ పరీక్షా కేంద్రాల వద్ద ఆంక్షలు


నిజామాబాద్, అక్టోబర్ 08 (డీడీ 9 వార్త):



తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 11 నుంచి 17 వరకు జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేస్తున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్‌లోని ఆదర్శ హిందీ విద్యాలయం హైస్కూల్ హిందీ మీడియం, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు.పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుమిగూడడం నిషేధమని తెలిపారు. పరీక్షల సమయంలో ఉదయం 7.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచనున్నట్లు సీపీ వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయవంతం కావాలని సీపీ ఆకాంక్షించారు.

పోలీసింగ్‌లో ఏఐ వినియోగం విస్తృతం చేయాలి

నిజామాబాద్, అక్టోబర్ 08, డీడీ 9 వార్త:



పోలీస్ శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని విస్తృతం చేయడంపై నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో అదనపు డీసీపీ అడ్మిన్ ఎన్. శుభం ప్రకాష్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు జరిగిన సమావేశంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. సమావేశంలో నేరాల విశ్లేషణ, నేరాల నివారణ, క్రైమ్ డేటా విశ్లేషణ, సీసీటీవీ ఫుటేజీ పరిశీలన, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాల దర్యాప్తు, సోషల్ మీడియా పర్యవేక్షణలో ఏఐ సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించారు. పోలీస్ సిబ్బందికి ఏఐపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు కళాశాలల్లోని సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. పోలీస్ శాఖ అవసరాలకు అనుగుణంగా ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌లు, అప్లికేషన్లు అభివృద్ధి చేయాలని, విద్యాసంస్థలు, పోలీస్ శాఖ సమన్వయంతో సాంకేతిక పరిష్కారాలను రూపొందించాలని నిర్ణయించారు. ఏఐ ద్వారా ప్రజలకు పోలీస్ సేవలను మరింత వేగంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో నవ్య భారతి జాయింట్ సెక్రటరీ డాక్టర్ శిరీష్, విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. స్వప్న, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఫ్యాకల్టీ సభ్యులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.





కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. లోటుపాట్లపై ఆగ్రహం

నిజామాబాద్, అక్టోబర్ 08 (డీడీ9 వార్త):

సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత, సిబ్బంది హాజరు నమోదులో తేడాలు, మౌలిక వసతుల పనుల్లో జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందుగా పాఠశాల పరిసరాలు, వంటగది, స్టోర్‌రూమ్, తరగతి గదులను పరిశీలించారు. ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి ఉండటాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. విషకీటకాలతో విద్యార్థినులకు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని నిర్వాహకులను నిలదీశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేసి దోమలు, కీటకాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది, విద్యార్థినుల హాజరును ఎఫ్ఆర్ఎస్ విధానంలో పరిశీలించారు. కొందరి హాజరు వివరాల్లో తేడాలు గుర్తించడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. హాజరు విషయంలో అక్రమాలు లేదా నిర్లక్ష్యం ఉంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. టాయిలెట్లు, ఫ్లోరింగ్ తదితర మౌలిక వసతుల పనులు ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదని ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. పనులను తక్షణమే ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. నాసిరకం బియ్యం, సరుకులు వస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలించి మరమ్మతులు చేయించాలని, సాధ్యం కాకపోతే కొత్త ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పాఠశాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. వారం, పది రోజుల తర్వాత తిరిగి తనిఖీ చేస్తానని, అప్పటిలోగా గుర్తించిన లోటుపాట్లన్నింటినీ సరిచేయాలని ఆదేశించారు. మండల అధికారులు సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను తరచూ తనిఖీ చేసి నిర్వహణను పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ ఆరిఫ్ అహ్మద్, ఎంఈఓ రమేష్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ షేక్ పర్వీన్ తదితరులు ఉన్నారు.





తెలంగాణ రక్షణ సేన. అధ్యక్షురాలు. కవితను కలిసిన ఆదివాసీలు.

అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం డిడి 9వార్త అక్టోబర్ 8

తలమడుగు మండలం పూనా కూడా గ్రామ ఆదివాసీలు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు . కల్వకుంట్ల కవితను హైదరాబాదులో. తెలంగాణ రక్షణ సేన భవనంలో కలిసినట్లు వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆదివాసి నాయకుడు.. కుంర జ్ఞానేశ్వర్. మాట్లాడుతూ హైదరాబాదులో కవితక్కను కలవడం చాలా ఆనందంగా ఉందని. ఉందని అన్నారు. ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను. వారికి వివరించినట్లు తెలిపారు

పార్టీ అధినేత్రి కవిత కూడా మాట్లాడుతూ. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు తమతో తెలిపిందని అన్నారు

ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవని. వాటిని మన భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నట్లు ఆదివాసి నాయకుడు జ్ఞానేశ్వర్ తెలిపారు





టీబీ నిర్మూలనలో యువత కీలక పాత్ర

- 'జోష్ టీం' వర్చువల్ లాంచింగ్

నిజామాబాద్, అక్టోబర్ 8 (డీడీ 9 వార్త):

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా యువతను టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో క్రియాశీల భాగస్వాములుగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన 'జోష్ టీం' వర్చువల్ లాంచింగ్ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పీ. నడ్డా గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. నిజామాబాద్ ఐడీఓసీ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, ఎన్‌టీఈపీ సిబ్బంది కార్యక్రమాన్ని వీక్షించారు.

'జోష్ టీం' ద్వారా యువతలో టీబీపై అవగాహన పెంచడంతో పాటు వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించడం, టీబీ అనుమానితులను గుర్తించి పరీక్షలకు ప్రోత్సహించడం, చికిత్స పొందుతున్న రోగులకు సహకారం అందించడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు. యువతను టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రజల్లో వ్యాధిపై అవగాహనను మరింత విస్తృతం చేయడమే ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. టీబీ నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు ఆరోగ్య శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, యువత, ప్రజల సమష్టి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో గీత, డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజశ్రీ, జడ్పీ సీఈఓ సాయ గౌడ్, డీటీసీఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, ఎన్‌టీఈపీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన బాల్యం

నిజామాబాద్, అక్టోబర్ 08 (డీడీ9 వార్త):

9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో "టౌన్ మన అంగన్వాడీ-మన బాధ్యత" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారిణి డి.సౌందర్య మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఎంతో కీలకమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణ, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ, పోషకాహార లోపం నివారణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులకు అందించే సేవలు, గ్రోత్ మానిటరింగ్, హాట్ కుక్డ్ మీల్స్, ప్రీస్కూల్ విద్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ అవసరమైన పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ ముంతాజ్ అలీ, 15వ డివిజన్ కార్పొరేటర్ సిరాజ్ ఉద్దీన్, సీడీపీవో విజయలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ అజమాల్ ఉన్నిసా, సూపర్‌వైజర్లు శ్రీప్రియ, ప్రియదర్శిని, రాధిక, నలిని, అంగన్వాడీ టీచర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





వరి పంటలకు తెగుళ్ల బెడద.. అధికారుల పరిశీలన

నిజామాబాద్, అక్టోబర్ 08 డీడీ9 వార్త:

భీమ్ గల్ మండలం బడా భీమ్ గల్ గ్రామంలో వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏడీఏ బి. లావణ్య, ఏఈఓ స్నేహ రైతుల పొలాలను సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. పలు ప్రాంతాల్లో వరి పంటకు పానికల్ మైట్, బీపీహెచ్ సుడిదోమ ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు ప్రొఫెనోఫాస్ + ప్రొపికోనజోల్ కలయిక మందును లీటర్ నీటికి 2 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అగ్గితెగులు నివారణకు అజోక్సిస్ట్రోబిన్ + టైసైక్లోజోల్ మందును ఎకరానికి 200 మి.లీ చొప్పున వినియోగించాలని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో కటుక తెగులు లక్షణాలు కూడా కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని నివారణకు ప్రొపికోనజోల్ 25 శాతం ఈసీ మందును లీటర్ నీటికి 1 మి.లీ చొప్పున, పుష్పించే దశలో మాత్రమే పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పంటలో తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి, వారి సూచనల మేరకు మందులను వినియోగించాలని అధికారులు సూచించారు.



జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు గడల అనిత ఎంపిక

నిజామాబాద్, అక్టోబర్ 08 డీడీ9 వార్త:



భీమ్ గల్ మండలం జగిర్యాల్ గ్రామానికి చెందిన గడల అనిత పీడీ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రెజ్లింగ్ పోటీల్లో 68 కిలోల విభాగంలో ఆమె పోటీపడి విజయం సాధించారు. ఈ విజయంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన గడల అనితను జగిర్యాల్ గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు అభినందించారు. రాబోయే పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకుల నిరసన.

డిడి9 వార్త గుడిహత్నూర్:



ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుడిహత్నూర్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బ్లాక్ డే ఫర్ ఇండియన్ డెమోక్రసీ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడసం దౌలత్ రావ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను తీవ్రంగావ్యతిరేకిస్తున్నామని అన్నారు.ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్నికల కమిషనర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపే వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు. ప్రజల ఓటు హక్కును, రాజ్యాంగ హక్కులను పరిరక్షించే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున తన పోరాటం చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోఆయ గ్రామాల సర్పంచ్ లు ఆడే శీలా, కాళ్లే భరత్,మాజీ జడ్పీటీసీ మస్కే మాధవ్, నాయకులు పెందుర్ జైరామ్, బాలాజీ పటేల్, మోహితే మారుతి, ఆడే జైపాల్, కాగ్నే రాంకిషన్, ససానే మాధవ్, ముండే రవి, ఆడే క్రాంతితదితరులు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా గ్రామ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

నిజామాబాద్, అక్టోబర్ 08 డిడీ9 వార్త:

భీమ్ గల్ మండలం సంతోష్‌నగర్ తాండ గ్రామంలో మహిళా గ్రామ సంఘం భవన నిర్మాణానికి ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామ సంఘ భవనాల నిర్మాణ పనులు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జరిగేవని, ప్రస్తుతం వీఎస్‌జీఆర్ఏఎంజీ సాంకేతిక సిబ్బంది పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. భవన నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ విభాగం సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో ఇంకుడు గుంతలు, ఫారం పాండ్ పనులను అధిక సంఖ్యలో ప్రారంభించి కూలీలకు మరింత ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జీ. నర్సయ్య, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ పూర్ణచంద్, టెక్నికల్ అసిస్టెంట్లు స్వామిదాస్, గణేష్, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘాల ప్రతినిధులు, ఐకేపీ సీసీలు గంగాధర్, గంగ సాయిలు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రెడ్ క్రాస్ ఎన్నికలో గెలిచినందుకు ఆత్మీయ సన్మానం

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 08: (డిడి 9 వార్త న్యూస్):



బోథ్ మండల కేంద్రం కి చెందిన మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్ ఇటీవలే జరిగిన రెడ్ క్రాస్ ఎన్నికలో బారి మెజార్టీ తో గెలిచి ఎం సి మెంబర్ గా ఎన్నిక అయినందుకు ఎంపీ క్యాంప్ కార్యాలయం లో ఆత్మీయ సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ ఇలాగే సమాజ సేవలో ముందు ఉండాలి అని రెడ్ క్రాస్ లో లైఫ్ మెంబర్ సభ్యత్వం అందరూ తీసుకొనేల కృషి చెయ్యాలి అని తెలిపారు నా వంతు సహాయ సహకారం ఎల్లపుడు ఉంటది అని తెలిపారు అలాగే సమాజ సేవలో యువత ముందు రావాలి అని కోరారు



ఏఎంసీ ఛైర్మన్ నాగేశ్వరరావును సన్మానించిన లయన్స్ క్లబ్

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 08(డీడీ9 వార్త) :

బోధన్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన లయన్ నాగేశ్వరరావుకు లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక లయన్స్ భవన్‌లో ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ బస వేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజా జీవితంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాగేశ్వరరావు ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచ్‌గా, ప్యాక్స్ సెక్రటరీగా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు అనితరసాధ్యమని, ప్రస్తుతం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారని ప్రశంసించారు. లయన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ... ఆయన మరింత ఉన్నతంగా ఎదుగుతూ బోధన్ గడ్డకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ వేడుకలో లయన్స్ క్లబ్ సభ్యులందరూ పాల్గొని నాగేశ్వరరావు సేవలను కొనియాడారు.

ఓటు చోరీ ఆరోపణలపై కాంగ్రెస్ రాస్తారోకో

నిజామాబాద్, అక్టోబర్ 08 డిడీ9 వార్త:

ఢిల్లీలో ఓటు చోరీ ఆరోపణలపై జరిగిన ఆందోళనలో రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నాయకులపై లాఠీచార్జ్ చేశారని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కమ్మర్ పల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన ఘటనకు నిరసనగా చేపట్టిన ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భువనగిరి భాస్కర్, భీమ్ గల్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, మోర్తాడ్ మండల అధ్యక్షుడు ఆనంద్, కమ్మర్ పల్లి పట్టణ అధ్యక్షుడు సల్లూరి గణేష్ గౌడ్, భీమ్ గల్ పట్టణ అధ్యక్షుడు అనంతరావు, బాల్కొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రిక్వెత్‌తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత : ఆర్డీఓ విజయ కుమారి

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 08(డీడీ9 వార్త) :

భ్రూణ లింగ నిర్ధారణ సమాజానికి శాపమని, ఆడపిల్లల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని బోధన్ ఆర్డీవో విజయకుమారి స్పష్టం చేశారు. గురువారం బోధన్ పట్టణంలోని నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజశ్రీ తో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం లయన్స్ క్లబ్ కాన్ఫరెన్స్ హాల్‌లో పిసిపిఎన్‌డిటి చట్టంపై నిర్వహించిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ...ఆడపిల్ల పుట్టడం కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఒక వరమని, భ్రూణ లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమని తెరిపారు. సమాజంలో లింగ వివక్షను పూర్తిగా నిర్మూలించి, సమతుల్య లింగ నిష్పత్తి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్కానింగ్ కేంద్రాలలో పిసిపిఎన్‌డిటి చట్ట నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలతో పాటు జరిమానాలు, జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. అనంతరం "బేటీ బచావో - బేటీ పడావో" నినాదాలతో ఆడపిల్లల సంరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ టీ.పద్మ, శ్రీ శరత్ రెడ్డి, ఉప వైద్యాధికారి డాక్టర్ విద్య, పిసిపిఎన్‌డిటి అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఐసీడీఎస్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.





ఇందూర్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 08(డీడీ9 వార్త) :

బోధన్ పట్టణంలోని ఇందూర్ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను ఉపాధ్యాయులు, విద్యార్థినులు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విభిన్న రకాల రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పాఠశాల ఆవరణలో అమర్చి విద్యార్థినులు, ఉపాధ్యాయినులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాటలు పాడుతూ ఆటలాడారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొండాలి కిషోర్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు, పూలకు పండుగైన బతుకమ్మకు ఎంతో విశిష్ట స్థానం ఉందన్నారు. ప్రకృత్యారాధనకు ప్రతిరూపంగా నిలిచే ఈ పండుగ భావితరాలకు మన సనాతన సంస్కృతిని, సామరస్యాన్ని చాటిచెబుతుందని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు మన ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక విశేషాలపై అవగాహన కల్పించడానికే పాఠశాలలో ఇలాంటి వేడుకలను ప్రతియేటా ఘనంగా నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం బతుకమ్మలను సమీప నీటి కుంట నిమజ్జనం చేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



డొంకల్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

నిజామాబాద్, అక్టోబర్ 08 డిడీ9 వార్త:

కమ్మర్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డొంకల్ గ్రామంలో గురువారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి సుమారు 75 మంది హాజరై వైద్య సేవలను పొందారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రక్త పరీక్షలు, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించి, అవసరమైన వారికి తగిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డొంకల్ సర్పంచ్ గడ్డం అనిల్, కమ్మర్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సరసింహస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ ఆకుల మారుతి, ఎంఎల్‌హెచ్‌పీలు దివ్య, లావణ్య, అలేఖ్య, సద్గుణ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రైతు భూములకు పక్కా హద్దులు తహసీల్దార్ అజ్మత్ నవాజ్

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 08(డీడీ9 వార్త) :

గ్రామాల్లో ఏళ్లుగా నలుగుతున్న భూ వివాదాల పరిష్కారానికే ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని సాలూర మండల తహసీల్దార్ అజ్మత్ నవాజ్ తెలిపారు. మండల పరిధిలోని ఫతేపూర్ గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామస్థులతో ముఖాముఖిగా మాట్లాడి, సర్వే పనులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పట్టాదారు భూమికి స్పష్టమైన సరిహద్దులు నిర్ణయిస్తామని, రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రికార్డుల ప్రక్షాళనతో భూ వివాదాలు పూర్తిగా సమసిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ దత్తు, ఫతేపూర్ సర్పంచ్ నూర్ అహ్మద్, ఉపసర్పంచ్ మోసిన, ఆర్ఐ శంకర్, సర్వేయర్ శ్రవణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బోధ్ మండల మైనారిటీ అధ్యక్షులుగా షేక్ అబ్దుల్ అలీం

- **జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ అబ్రార్**

అదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 08: (డిడి 9 వార్త న్యూస్):



ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కమిటీ నూతన పదవులను ప్రకటించిన సందర్భంగా, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ షహీద్ అలీ గారు బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులుగా షేక్ అబ్దుల్ అలీం, ఆదిలాబాద్ జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ అబ్రార్లను ప్రకటించారు.
ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన షేక్ అబ్దుల్ అలీం, మొహమ్మద్ అబ్రార్‌లకు బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది

డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్

నిజామాబాద్, అక్టోబర్ 08 డిడీ9 వార్త:

కమ్మర్ పల్లి మండలం కోనాసముందర్ గ్రామంలోని తక్కేవాడలో నూతన మురుగు కాలువ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బెజ్జారం రాకేష్ ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన నిధులను వినియోగించి ఈ పనులను చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలో మురుగు నీరు నిలిచిపోయే ప్రాంతాలను గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట్ల నూతన డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో మురుగు కాలువలు లేని ప్రాంతాలను గుర్తించి దశలవారీగా పనులు చేపడతామని తెలిపారు. ఇప్పటికే ఉన్న కాలువల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, మరమ్మతులు అవసరమైన చోట వాటిని కూడా చేపడతామని పేర్కొన్నారు. డ్రైనేజీ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రజలు కూడా సహకరించాలని, మురుగు కాలువల్లో చెత్త వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. తక్కేవాడలో నూతన డ్రైనేజీ నిర్మాణంతో మురుగు నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు తెలిపారు. గ్రామంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా అవసరమైన చోట్ల డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ వెల్లడించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భలే రావు శంకర్, సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డి, వార్డు సభ్యుడు కలిపే శేఖర్, గ్రామ కార్యదర్శి శ్రీలత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మహిళా వికాసానికి ప్రత్యేక నిధులు

• సర్పంచ్ నూర్ అహ్మద్

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 08(డీడీ9 వార్త) :

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధితో పాటు మహిళా లోకానికి ఆసరాగా నిలిచే మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని ఫతేపూర్ సర్పంచ్ నూర్ అహ్మద్ అన్నారు. సాలూర మండలం ఫతేపూర్ గ్రామంలో మహిళా మండలి భవన నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే గ్రామం సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. త్వరలోనే భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోసీన్, వార్డు మెంబర్లు షేక్ బాబు, యూసఫ్, రవి, బాబు, గౌస్ పాల్గొన్నారు.



ధన్నూరులో ఎం.పీ జీ నగేష్ గారు పరామర్శ

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 08: (డిడి 9 వార్త న్యూస్):

ఈరోజు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ బోథ్ మండలంలోని దన్నూర్ గ్రామంలో ఇటీవల ఇద్దపు సాయి రెడ్డి తల్లీ ఇద్దపు చంటి అమ్మ మృతి చెందింది ఈరోజు వారి కుటుంబానికి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారితో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు , బోథ్ సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, సీనియర్ నాయకులు జాదవ్ రమేష్, గాదె శంకర్, మహిపాల్, గోడం జుగాది రావు, అశోక్ రెడ్డీ, వెంకటేష్ నారాయణ శేఖన్న మహిపాల్ తదితరులు పాల్గొన్నారు



జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల ఇంచార్జ్ గా ఆర్ రాజేంద్రప్రసాద్

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: అక్టోబర్ 08: (డిడి 9 వార్త న్యూస్):

సోనాల మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన ఆర్ రాజేంద్రప్రసాద్ ని మరియు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైనటువంటి O ప్రకాష్ (గణితం) పి శేఖర్ (ఇంగ్లీష్) ఉపాధ్యాయులను సోనాల మాజీ సర్పంచ్ చెట్ల పెళ్లి సదానందం ఈరోజు పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ మన పాఠశాల నుండి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైనటువంటి ఉపాధ్యాయులను అభినందిస్తూ వారి సేవలను కొనియాడారు అలాగే కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ప్రధానోపాధ్యాయులు కి పాఠశాల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ధన్నూర్ రాంరెడ్డి రామయి శంకర్ మరియు తోటి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు



పీఎస్ఎల్ 12వ సీజన్ తేదీలు ఖరారు..
ఐపీఎల్‌తో మరోసారి ఢీ!


- వచ్చే ఏడాది మార్చి 18 నుంచి మే 2 వరకు పీఎస్ఎల్ 12వ సీజన్
- గత సీజన్ మాదిరిగానే 8 జట్లతో టోర్నమెంట్ నిర్వహణ
- లండన్‌లో జరిగిన సమావేశంలో తేదీలను ఖరారు చేసిన నిర్వాహకులు
- పీఎస్ఎల్ షెడ్యూల్ మరోసారి ఐపీఎల్‌తో క్లాష్ అయ్యే అవకాశం

డీడీ9 వార్త :

పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 12వ ఎడిషన్ తేదీలు ఖరారయ్యాయి. వచ్చే ఏడాది మార్చి 18 నుంచి మే 2 వరకు ఈ మెగా టోర్నమెంట్ జరగనుంది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా మొత్తం 8 జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. లండన్‌లో సెప్టెంబర్ 1న జరిగిన పీఎస్ఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఈ తేదీలను ఖరారు చేశారు. ఈ భేటీకి 8 ఫ్రాంచైజీల యజమానులు, ప్రతినిధులు హాజరయ్యారు.

పీఎస్ఎల్ 11వ సీజన్‌లోనే 8 జట్ల ఫార్మాట్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టారు. అలాగే డ్రాఫ్ట్ విధానానికి బదులుగా ఆటగాళ్ల వేలం నిర్వహించారు. మే నెలలో గడాఫీ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో హైదరాబాద్ కింగ్స్‌మెన్‌ను ఓడించి, పెషావర్ జల్మీ తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ టైటిల్ గెలుచుకుంది. ఈ మ్యాచ్‌కు 32,461 మంది ప్రేక్షకులు హాజరయ్యారు.

తాజా ప్రకటనపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మోహసిన్ నఖ్వీ స్పందించారు. "పీఎస్ఎల్ 11 ఈ లీగ్ సత్తా ఏంటో ప్రపంచానికి చూపించింది. రికార్డు స్థాయిలో ప్రేక్షకులు, ప్రసారాలతో దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపింది. పీఎస్ఎల్ 12 ఆ స్థాయిని మరింత పెంచుతుంది. మరో అద్భుతమైన సీజన్‌ను అందిస్తాం" అని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ షెడ్యూల్ ప్రకటనతో ఆటగాళ్ల రిటెన్షన్, ట్రేడ్ విండో, వేలం వంటి కీలక ప్రక్రియలకు మార్గం సుగమమైంది. అయితే, పీఎస్ఎల్ తేదీలు మరోసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) షెడ్యూల్‌తో క్లాష్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ టోర్నీలో హైదరాబాద్ కింగ్స్‌మెన్, ఇస్లామాబాద్ యునైటెడ్, కరాచీ కింగ్స్, లాహోర్ ఖలందర్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్, రావల్పిండి జట్లు ఉన్నాయి.



ప్రజాప్రతినిధులే ప్రజలను భక్షిస్తుంటే దిక్కెవరు...?

- మహిళలపై వేధింపుల ఆరోపణలు.. ప్రజల్లో తీవ్ర ఆవేదన
- శాయంపేట మండలకేంద్రంలో ప్రజాప్రతినిధులంటే భయంతో వణుకుతున్న ప్రజలు
- ప్రజాసేవ చేయాల్సిన వారే దౌర్జన్యాలకు పాల్పడితే సామాన్యులకు రక్షణ ఎక్కడ..?
- శాయంపేట మండల ప్రజల ఆవేదన

శాయంపేట,అక్టోబర్ 08,డి డి 9వార్త

ప్రజల మన్ననలు పొంది వార్డు మెంబర్‌గా ఎన్నికై, రెండుసార్లు ఉపసర్పంచ్‌గా గెలిచిన ప్రస్తుత ఉపసర్పంచ్ దయనంపల్లి సుమన్‌పై ఓ వివాహిత మహిళను మానసికంగా వేధించారంటూ వచ్చిన ఆరోపణలు శాయంపేట మండలంలో తీవ్ర చర్చకు దారితీశాయి.ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిపైనే మహిళను వేధించారనే ఆరోపణలు రావడం పట్ల మండల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అండగా నిలవాల్సిన వ్యక్తులపై ఇలాంటి ఆరోపణలు రావడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రజాప్రతినిధి అంటే ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, ప్రజలకు భరోసా కల్పించేందుకు ముందుండాల్సిన వ్యక్తి. అలాంటి పదవిలో ఉన్న వ్యక్తిపై మహిళల విషయంలో వేధింపులకు సంబంధించిన ఆరోపణలు రావడం ఆందోళన కలిగించే అంశమని స్థానికులు అంటున్నారు. ఒక మహిళ తనకు వేధింపులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడితే ,ఆమెకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.ఆరోపణలు నిజమా..? కాదా..? అనే విషయాన్ని పక్కనపెట్టి వాటిపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదేనా ప్రజాసేవ..? ఇదేనా ప్రజాస్వామ్యం..? ప్రజల ఓట్లతో గెలిచి పదవులు చేపట్టిన ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు అంటున్నారు. పదవి అనేది వ్యక్తిగత ప్రతిష్ట కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించాల్సిన బాధ్యత అని గుర్తుచేస్తున్నారు.పదవిని అడ్డుపెట్టుకుని ఎవరిపైనా ఒత్తిడి, వేధింపులు లేదా దౌర్జన్యానికి పాల్పడే పరిస్థితులు ఏర్పడకూడదని స్పష్టం చేస్తున్నారు. గతంలోనూ ఇదే ఉపసర్పంచ్‌కు సంబంధించి ఓ ప్రజాప్రతినిధి కుటుంబంతో వివాదం చోటుచేసుకుని,మహిళల పట్ల దౌర్జన్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు వెలువడ్డాయని స్థానికులు పేర్కొంటున్నారు. గత ఘటనలపై కూడా పూర్తిస్థాయిలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయా..? లేదా..? అనే అంశంపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే వ్యక్తికి సంబంధించి పదేపదే వివాదాలు, ఆరోపణలు తెరపైకి వస్తున్నప్పుడు సంబంధిత అధికారులు వాటిని తేలికగా తీసుకోకుండా నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రజాస్వామ్యంలో పదవి ఉన్నవారికి ఒక న్యాయం,సామాన్యులకు మరో న్యాయం ఉండకూడదని ప్రజలు అంటున్నారు. రాజకీయ పలుకుబడి,ప్రజాప్రతినిధి హోదా,అధికార పరిచయాలు ఎవరికీ చట్టానికి అతీతమైన రక్షణగా మారకూడదని స్పష్టం చేస్తున్నారు.ముఖ్యంగా మహిళలకు సంబంధించిన ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై పారదర్శకంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.“ఎవరిని నమ్మాలి..? ఏ ప్రభుత్వాన్ని నమ్మాలి..? మా రక్షణ ఎవరిది..?” అంటూ సామాన్య ప్రజలు,మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజల కోసం పనిచేయాల్సిన వ్యవస్థలోనే తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ప్రజలకు కలగాలని కోరుతున్నారు.ఒక మహిళకు అన్యాయం జరిగిందనే ఆరోపణ వచ్చినప్పుడు ఆమెకు న్యాయం చేయడమే కాకుండా,ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి కూడా తన వాదనను వినిపించే అవకాశం కల్పించి వాస్తవాలను నిష్పక్షపాతంగా నిర్ధారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.ప్రజల ఓట్లతో పదవిలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు ప్రజలకు రక్షణగా నిలవాలి తప్ప ప్రజల్లో భయాందోళనలు కలిగించే పరిస్థితులు రావద్దని మండల ప్రజలు కోరుతున్నారు.మహిళల గౌరవం, సామాన్యుల ఆత్మగౌరవం విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని అంటున్నారు. ఆరోపణలు నిజమని తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే అదే విషయాన్ని స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధి అయినా సామాన్యుడైనా చట్టం ముందు అందరూ సమానమేననే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని,భవిష్యత్తులో మహిళలు లేదా సామాన్య ప్రజలు ఇలాంటి ఆరోపణలు, వేధింపులకు గురవుతున్నారనే పరిస్థితులు తలెత్తకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సంజూకి మరో ఛాన్స్ ఇస్తారా? మయాంక్ సంగతేంటి?..
నేడు వెస్టిండీస్‌తో భారత్ రెండో టీ20

- ఐదు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో భారత్
- సంజూ శాంసన్ వరుస వైఫల్యాల నేపథ్యంలో అతి సెలక్షన్‌పై ఆసక్తి
- అతడి స్థానంలో సూర్యవంశీని తీసుకుంటారా అనే సందేహాలు
- భారీగా పరుగులిచ్చిన మయాంక్ యాదవ్ పరిస్థితిపైనా చర్చ
- రెండో టీ20 అయినా గెలవాలనే కోణంలో వెస్టిండీస్ వ్యూహాలు

డీడీ9 వార్త :

తొలి టీ20లో వెస్టిండీస్ పై అదరగొట్టిన భారత్.. అదే జోరులో సిరీస్ లో 20తో ముందంజ వేయాలని చూస్తోంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో భారీ ఓటమి ఎదురైన వెస్టిండీస్ ఎలాగైనా పుంజుకుని సిరీస్‌ను సమం చేయాలని పట్టుదలగా ఉంది. అయితే రాంచీలో శుక్రవారం జరిగే రెండో టీ20కి ముందు ఫలితం కంటే ఎక్కువగా ఆసక్తి రేపుతున్నది భారత జట్టు ఎంపికే. సంజూ శాంసన్ కొనసాగుతాడా? వైభవ్ సూర్యవంశీకి అవకాశం వస్తుందా? తొలి మ్యాచ్‌లో భారీగా పరుగులు ఇచ్చిన మయాంక్ యాదవ్‌కు మరో ఛాన్స్ ఇస్తారా? ఈ ప్రశ్నలకు రేపు సమాధానం దొరకనుంది. లక్నోలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వెస్టిండీస్ 171 పరుగులు చేయగా.. భారత్ కేవలం 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 43 బంతుల్లోనే అజేయంగా 102 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి 137 పరుగుల అజేయ భాగస్వామ్యంతో భారత్‌కు సునాయాస విజయాన్ని అందించాడు.

సంజూ స్థానంపై ఉత్కంఠ

తొలి మ్యాచ్‌లో సంజూ శాంసన్ 11 పరుగులకే వెనుదిరిగాడు. అంతకుముందు అతడి చివరి నాలుగు టీ20 ఇన్నింగ్స్‌లు 9, 7, 2, 11 పరుగులుగా ఉన్నాయి. దీంతో ఓపెనింగ్ స్థానంపై చర్చ మొదలైంది. జట్టులో వైభవ్ సూర్యవంశీ రూపంలో దూకుడైన మరో ఓపెనర్ ఉన్నాడు. పవర్‌ప్లేలోనే బౌలర్లపై విరుచుకుపడే సామర్థ్యం వైభవ్‌కు ఉంది. అందుకే అతడిని తుది జట్టులోకి తీసుకుంటే భారత్ ఓపెనింగ్ కూర్పులో మార్పు చేసే అవకాశం ఉంటుంది. అయితే ఒక్క మ్యాచ్‌లో విఫలమైనందుకు సంజూను పక్కన పెడతారా? లేక అనుభవం ఉన్న వికెట్‌కీపర్ బ్యాటర్‌కు మరో అవకాశం ఇస్తారా? అన్నదే అసలు ఉత్కంఠ.

మయాంక్‌కు మరో అవకాశం?

బౌలింగ్‌లోనూ భారత్‌కు ఒక ప్రశ్న ఎదురవుతోంది. తొలి టీ20లో మయాంక్ యాదవ్ తన మొదటి ఓవర్లోనే 16 పరుగులు ఇచ్చాడు. మొత్తంగా కూడా అతడి బౌలింగ్‌లో పరుగుల పరద పారింది. అయితే రూథర్‌ఫోర్డ్‌ను ఔట్ చేసి ఒక వికెట్ సాధించాడు.

మరోవైపు అరంగేట్ర మ్యాచ్‌లో నమన్ ధీర్ 3 వికెట్లతో అదరగొట్టాడు. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో స్పిన్ విభాగంపై భారత్‌కు పెద్దగా ఆందోళన కనిపించడం లేదు. పేస్ కూర్పులోనే మార్పు చేసే అవకాశం ఉంది.

అయితే మయాంక్‌ను వెంటనే తప్పించకుండా మరో అవకాశం ఇవ్వాలన్న అభిప్రాయం కూడా ఉంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రయోగాలకు అవకాశం ఉన్నప్పటికీ.. సిరీస్ ఆధిక్యాన్ని 20కి పెంచుకోవడం కూడా భారత్‌కు ముఖ్యమే.

శ్రేయస్ ఫామ్.. భారత్‌కు పెద్ద బలం

తొలి మ్యాచ్‌కు ముందు శ్రేయస్ అయ్యర్ ఫామ్‌పై ప్రశ్నలు తలెత్తాయి. కానీ కెప్టెన్ తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు. 43 బంతుల్లో 102 పరుగులతో టీ20ల్లో తొలి శతకాన్ని నమోదు చేశాడు. దీంతో భారత మిడిలార్డర్‌కు భారీ బలం వచ్చింది. తొలి మ్యాచ్‌లో 35 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌ను అయ్యర్, ఇషాన్ కిషన్ కలిసి గట్టెక్కించారు. ఇప్పుడు వెస్టిండీస్ బౌలర్లు అయ్యర్‌ను ఎలా అడ్డుకుంటారన్నది కూడా మ్యాచ్‌లో కీలక అంశంగా మారనుంది.

వెస్టిండీస్ ఏం చేస్తుంది?

తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయింది. తర్వాత షాయ్ హోప్ 52, రూథర్‌ఫోర్డ్ 56 పరుగులతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. కానీ చివరికి 171 పరుగులకే ఆలౌటైంది. భారత్ బ్యాటింగ్ బలం ముందు ఈ స్కోరు సరిపోలేదు.రాంచీలో పరిస్థితులను ఉపయోగించుకుని భారత్‌పై ఒత్తిడి పెంచాలని కరీబియన్ జట్టు చూస్తోంది. ముఖ్యంగా భారత ఓపెనర్లను తొందరగా ఔట్ చేయడం, అయ్యర్‌కు పరుగులు చేయకుండా కట్టడి చేయడం వెస్టిండీస్ వ్యూహంలో కీలకం కానుంది.

రాంచీలో ఛేజింగ్‌కు పైచేయి

రాంచీ జేఎస్‌సీఏ స్టేడియంలో ఇప్పటివరకు ఏడు టీ20 మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో నాలుగు మ్యాచ్‌ల్లో రెండోసారి బ్యాటింగ్ చేసిన జట్టే గెలిచింది. మూడు మ్యాచ్‌ల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు విజయం సాధించింది. ఇక్కడ తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 138 పరుగులుగా ఉంది. అయితే భారీ స్కోర్లకు కూడా ఈ మైదానం వేదికైంది. శ్రీలంకపై భారత్ 196/6 చేయడం ఇక్కడ అత్యధిక టీ20 స్కోరు. న్యూజిలాండ్‌పై భారత్ 155 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించడం ఇక్కడ అత్యధిక విజయవంతమైన ఛేజ్.



వైభవ్ విషయంలో తొందరొద్దు.. వినోద్ కాంబ్లీని గుర్తుచేసిన కపిల్ దేవ్!


- 15 ఏళ్ల క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై కపిల్ దేవ్ వ్యాఖ్యలు
- ఇప్పుడే భారీ అంచనాలు పెట్టుకోవడం తొందరపాటు అవుతుందని హెచ్చరిక
- మూడేళ్ల తర్వాతే అతని కెరీర్‌పై ఒక అంచనాకు రావాలని సూచన

డీడీ9 వార్త :

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై వస్తున్న ప్రశంసల నేపథ్యంలో భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అద్భుత ప్రతిభ ఉన్నప్పటికీ, అతని కెరీర్‌పై ఇప్పుడే భారీ అంచనాలు పెట్టుకోవడం తొందరపాటు అవుతుందని హెచ్చరించాడు. ప్రతిభ ఒక్కటే సుదీర్ఘ కెరీర్‌కు గీటురాయి కాదని చెబుతూ, మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఉదంతాన్ని ఉదాహరణగా చూపించాడు.

ఈ విషయంపై కపిల్ దేవ్ మాట్లాడుతూ... "ఇప్పుడే అతని గురించి మాట్లాడటం తొందరపాటు అవుతుంది. అతనికి సామర్థ్యం ఉందా? అంటే.. కచ్చితంగా ఉంది. కానీ క్రికెట్‌లో ఎంతో మంది అపారమైన ప్రతిభతో అరంగేట్రం చేసి, ఆ తర్వాత కనుమరుగైపోయారు" అని అన్నాడు. "వినోద్ కాంబ్లీని చూడండి. దాని గురించి మనం ఏం చెప్పగలం?" అని ప్రశ్నించాడు.

"వైభవ్‌కు ఇప్పుడు 15 ఏళ్లు. అతనికి మరో మూడేళ్ల సమయం ఇవ్వండి, ఆ తర్వాత మనం మాట్లాడదాం. అప్పటికి అతని జీవన శైలి, ఆలోచనా విధానం ఎలా మారతాయో చూడాలి. ప్రస్తుత ప్రదర్శన కంటే రాబోయే రెండేళ్లలో అతను తనను తాను ఎలా మలచుకుంటాడనేది చాలా ముఖ్యం" అని కపిల్ వివరించాడు.ఐపీఎల్ 2026లో 776 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ గెలవడం, అండర్19 ప్రపంచకప్ ఫైనల్‌లో 80 బంతుల్లోనే అజేయంగా 175 పరుగులు చేయడం వంటి అద్భుత ప్రదర్శనలతో వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో



యువ ఆటగాడిపై మితిమీరిన అంచనాలు వద్దని కపిల్ దేవ్ స్పష్టం చేశారు.



అసలేం జరిగింది..?!


అసలేం
జరిగింది


అసలేం
జరిగింది

ఇకనుంచి మరోలెక్క..

ఇప్పటి వరకు గ్లామర్ పాత్రల్లో ఎక్కువగా కనిపించిన బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ దిశా పటాని.. ఇకపై రూటు మార్చబోతున్నట్లు చెప్పుకొచ్చింది. ఆమె ప్రేక్షకులకు పరిచయమైన తొలి చిత్రం 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'. భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. ఆ సినిమా విడుదలై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తను ఈ పదేళ్లలో నటిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని గుర్తుచేసుకుంటూ.. 'ఈ పదేళ్ల నా సినీ జీవితంలో విభిన్నమైన అనుభవాలు నాను మరింత పరిణతి చెందిన నటిగా తీర్చిదిద్దాయి. ఇప్పటివరకు నేను ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యమున్న సినిమాల్లో నటించాను. కానీ ఇకపై నా కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేయాలనుకుంటున్నా. సినిమా పరిశ్రమలో గ్లామర్‌తో గుర్తింపు తెచ్చుకోవడం ఒక ఎత్తయితే, నటిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించడం మరో ఎత్తు. అందుకే ఇకపై ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా, నాలోని నటనా ప్రతిభను బయటపెట్టే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నా' అన్నది. కేవలం తెరపై అందంగా కనిపించడమే కాకుండా, కథలో కీలక పాత్ర పోషించే క్యారెక్టర్లు చేయాలని ఉందని దిశా పటాని చేసిన కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.



'జైలర్ 3'కి రంగం సిద్ధమవుతోందా..

టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా ప్రేక్షకులు ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్న చిత్రాల్లో 'జైలర్ 2' ఒకటి. వరుస పరాజయాల తర్వాత సూపర్ స్టార్ రజినీకాంత్ గట్టి కమ్ బ్యాక్ ఇచ్చిన 'జైలర్' చిత్రానికి ఇది సీక్వెల్‌గా రాబోతుండగా ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ హైప్ ఏర్పడింది. సెన్సేషనల్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీ విడుదలకు సిద్ధమైంది. తాజాగా సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తి చేసుకున్న ఈ చిత్రం U/A సర్టిఫికేట్ సొంతం చేసుకుని 2 గంటల 45 నిమిషాల రన్ టైమ్‌తో అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం వరుస ఇంటర్వ్యూస్‌లో పాల్గొంటు సందడి చేస్తున్నారు. ఇందులో భాగంగానే జైలర్ 3కు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ప్రజెంట్ నెట్టింట సందడి చేస్తుంది. జైలర్ 2 క్లైమాక్స్‌లో మూడో భాగానికి సంబంధించిన కీలక హింట్‌ను ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దర్శకుడు నెల్సన్ జైలర్ 3 కథాంశాన్ని రజినీకాంత్‌కు వివరించగా, సూపర్‌స్టార్ కూడా మూడో భాగంపై ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. అయితే 'జైలర్ 3' పట్టాలెక్కాలంటే 'జైలర్ 2'పై వచ్చే టాక్ ప్రధాన అంశంగా మారింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో మూడో భాగాన్ని నిర్మించే అవకాశం ఉండగా, 2028లో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కే చాన్స్ ఉంది. కాగా.. ఇందులో సూరజ్ వెంజరమూడు, ఎస్.జే సూర్య, విద్యాబాలన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అలాగే మొదటి భాగంలో అతిథి పాత్రల్లో మెరిసని మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, మిథున్ చక్రవర్తి కూడా ఈ సీక్వెల్‌లో కనిపించనుండటం విశేషం. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.



మా లాయర్లతోనూ ఓ మంచి సినిమా తీయండి



''మంచి సినిమా తీయండి. ప్రేక్షకుల్ని మళ్లీ అలరించండి'' అంటూ సుప్రీం కోర్టు.. బాలీవుడ్ నటుడు రాజ్‌పాల్ యాదవ్ చెక్‌బౌన్స్ కేసులో ఆయన్ని ఉద్దేశించి బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇటీవలే రాజ్‌పాల్ చెక్‌బౌన్స్ కేసులో చిక్కుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ విచారణకు రాజ్‌పాల్ యాదవ్ స్వయంగా హాజరై తన తొలి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అటా పటా లాపట్టా' వల్ల భారీగా నష్టపోయానంటూ కోర్టుకు తెలిపారు. ''నేను సుమారు 250 చిత్రాల్లో నటించాను. గత 13 ఏళ్లలో రూ.250 కోట్లు నష్టపోయాను. ఈ సినిమా 1,200 థియేటర్లలో రావాల్సి ఉండగా ఒక్క థియేటర్లో కూడా విడుదల కాలేదు. ఇప్పుడు నా దగ్గర ఒక్క రూపాయి కూడా లేదు. నన్ను జైలుకి పంపించినా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను'' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన సీజేఐ.. ''కొత్త చిత్రం ఏమైనా వస్తోందా? మంచి సినిమా తీయండి. మళ్లీ ఇమేజ్‌ను పెంచుకోండి. మా దగ్గర కూడా మంచి నటులైన న్యాయవాదులు ఉన్నారు. వాళ్లతో ఓ సినిమా తీయొచ్చు కదా'' అని సరదాగా వ్యాఖ్యానించారు. నటుడి ప్రవర్తన పట్ల తాము సంతృప్తిగా లేకపోయినా ఆయనకు కొంత ఊరటనిస్తూ గడువు ఇస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

'భారతీయుడు 3'పై బిగ్ అప్డేట్.. ఈసారి వార్ మోడ్‌లో సేనాపతి!



ప్రముఖ నటుడు కమల్ హాసన్ (Kamal Haasan), అగ్ర దర్శకుడు శంకర్ (Shankar Shanmugham) కలయికలో 30ఏళ్ల క్రితం వచ్చిన 'భారతీయుడు' సంచలన విజయం సాధించింది. తండ్రీ కొడుకులుగా కమల్ ద్విపాత్రాభినయం, లంచగొండితనానికి వ్యతిరేకంగా సేనాపతి పాత్రలో ఆయన చేసిన పోరాటం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే, దీనికి కొనసాగింపుగా 2024లో వచ్చిన 'భారతీయుడు 2' మాత్రం ఆ స్థాయిలో మ్యాజిక్ చేయలేకపోయింది. భారీ అంచనాలతో వచ్చిన ఆ చిత్రం వాటిని అందుకోవడంలో విఫలమైంది. ఈ ఫలితం తీవ్రంగా నిరాశపరచడంతో 'భారతీయుడు' ఫ్రాంచైజీలో మరో చిత్రం ఉంటుందా? లేదా? అన్నదానిపై రెండేళ్లుగా సందిగ్ధత నెలకొంది. దీనికి తెరదించుతూ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ (Lyca Productions) తాజాగా బిగ్ అప్డేట్ ఇచ్చింది. 'భారతీయుడు 3' (Indian 3)ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని స్పష్టం చేసింది.

ఈ సందర్భంగా 'భారతీయుడు 3: వార్ మోడ్' అనే టైటిల్‌తో ఓ పోస్టర్‌ను పంచుకుంది. 'సేనాపతి పునరుత్థానం మొదలవబోతోంది.. ఈసారి ఎవ్వరినీ ఉపేక్షించడు..' అనే వ్యాఖ్యను జోడించారు. సేనాపతి పాత్రధారి అయిన కమల్ మరో ఇద్దరితో కలసి గుర్రపు స్వారీతో దూసుకెళ్తున్న దృశ్యం ఆసక్తి రేపుతోంది. 'భారతీయుడు 2'లో నటించిన కాజల్ అగర్వాల్, సిద్ధార్థ్, ఎస్.జె.సూర్య తదితరులు మూడో భాగంలోనూ కనిపించబోతున్నారు. అనిరుధ్ సంగీతమందించబోతున్నారు. మరి, ఈ చిత్రం ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందన్నది తెలియాల్సి ఉంది.

ది ట్రెటర్స్' రియాలిటీ షోకి థ్రిల్లర్ చిత్రం చూస్తున్నట్టే...

ది ట్రెటర్స్' రియాలిటీ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరించడం, ఒక సినిమాలో ఓ ఆసక్తికరమైన పాత్రని పోషించినట్టే అనిపించిందన్నారు యువ హీరో తేజ సజ్జా. ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'ది ట్రెటర్స్'తెలుగు షో అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ నెల 15 నుంచి ప్రతి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రసారం కానుంది. ఈ సందర్భంగా తేజ సజ్జా బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. "తెలుగులో ఎప్పుడూ చూడని ఓ పెద్ద స్థాయి రియాలిటీ షో ఇది. ఒక హత్యోదంతం నేపథ్యంలో సాగే థ్రిల్లర్ సినిమాని చూస్తున్నట్టే ఉంటుంది. వ్యాఖ్యాత పాత్ర కూడా ఇందులో కీలకమే. మొదటి మూడు ఎపిసోడ్స్ తర్వాత ఈ షో ఎలా ఉంటుందో స్పష్టత వస్తుంది. అన్ని రంగాలకు చెందినవాళ్లు ఇందులో భాగమయ్యారు" అన్నారు తేజ సజ్జా.



నగరాల్లో మన చుట్టూ గోడలు.. కానీ మా ఊళ్లో మాత్రం..



నానా పటేకర్ (Nana Patekar) ఎవరు అని అడిగితే బాలీవుడ్ (Bollywood) నటుడు అనడం సరికాదేమో! ఎందుకంటే ఆయనెప్పుడూ బాలీవుడ్‌ను తన గుర్తింపుగా భావించలేదు, అలా చెప్పుకోవడానికి కూడా తనకు ఇష్టం ఉండేది కాదు. పల్లెటూరి నుంచి వచ్చి ఎన్నో కష్టాలు ఎదుర్కొని నటుడిగా ఎదిగిన నానా పటేకర్.. చివరివరకూ సాధారణ జీవితాన్నే గడిపారు. ఓ సందర్భంలో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (Kaun Banega Crorepati) షోలో హోస్ట్ అమితాబ్ బచ్చన్‌తో (Amitabh Bachchan) నానా చెప్పిన విషయాలు వింటే జీవితం పట్ల ఆయనకున్న దృక్పథం అర్థమవుతుంది.

"నన్ను నేను సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తిగా భావించను. నేను ఇక్కడికి వచ్చి, నా పని పూర్తిచేసుకొని వెళ్లిపోతుంటాను. ఇక్కడ జరిగే పార్టీలకు ఎప్పుడూ వెళ్లను. ఇక్కడి లైఫ్‌స్టైల్ నాకు నచ్చదు. నేను ఓ పల్లెటూరి నుంచి వచ్చాను. పల్లెటూరి మనిషిలాగే ఉంటాను. అదే నా సొంత ఇంటిలా అనిపిస్తుంది" అని నానా చెప్పారు. జీవితం గురించి ఆయన మాట్లాడుతూ.. "జీవితం నేను ఆశించిన దానికన్నా ఎక్కువ ఇచ్చింది. మన అవసరాలు పరిమితంగా ఉంటే, ప్రతిదీ సుఖంగానే అనిపిస్తుంది. అలాంటి జీవితమే నాకిష్టం. నగరాల్లో మనుషుల చుట్టూ గోడలుంటాయి. కానీ మేమున్న చోట చుట్టూ కొండలుంటాయి. వాటి మధ్య మేం జీవిస్తాం. అక్కడ జీవితం చాలా సులువుగా ఉంటుంది" అని నానా తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. ఆయన మాటలతో అమితాబ్ కూడా ఏకీభవించారు.

జానర్ ఏదైనా అందులో నటించడానికి వెనకడుగు వేయని నటిగా గుర్తింపు పొందాలని అనుకుంటున్నానని అంటున్నారు అందాల భామ మృణాల్ ఠాకూర్. ఎంచుకునే పాత్రలతోనే గుర్తుండిపోయే నాయికల్లో ముందు వరుసలో ఉంటారీమె. ఈ ఏడాది ప్రారంభంలోనే 'డెకాయిట్', 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' లాంటి భిన్నమైన చిత్రాలతో తెరపై మెరిసిన ఈ తార.. ఈ మధ్యే 'పూజా మేరీ జాన్'తో ఓటీటీ వేదికగా కూడా సందడి చేశారు. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న మృణాల్.. ఒక నటిగా తన కోరికల జాబితా గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. "ఈ మధ్య ఎక్కువగా తెలిసినవే అయినా కొత్త కోణంలో సాగే కథల పట్ల ఆకర్షి తురాలినవుతున్నా. నిజ జీవితానికి దగ్గరగా ఉండే కథల్లో భాగం కావాలని కోరుకుంటున్నా. ఆ పాత్రతో నేను మమేకం అవ్వాలి. అదే సమయంలో ప్రేక్షకులకు కూడా ఆ పాత్రతో అనుబంధం కలిగేలా చేయగలగాలి. ఒకే రకమైన పాత్రలను మళ్లీ మళ్లీ చేయకూడదన్నదే నా నిరంతర ప్రయత్నం. 'లవ్ సోనియా', 'పూజా మేరీ జాన్', 'సీతారామం'.. నా దృష్టిలో ఇవన్నీ భిన్నమైన సినిమాలే. కెరీర్‌లో ముందుకెళ్తున్న కొద్దీ వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాన"ని చెప్పారు మృణాల్.

అదే నా నిరంతర ప్రయత్నం!

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.